

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 22-06-2025 | సంపుటి - 24 | సంచిక - 51 | రూ : 4 | పేజీలు: 8




## ఎడ్‌సెట్‌లో... అమ్మాయిలదే పైచేయి

- ఉత్తీర్ణులైన వారిలో 81.50 శాతం వారే
- తొలి 10 ర్యాంకర్లలో మాత్రం ముగ్గురే

హైదరాబాద్: రాష్ట్రంలో బీఈడీ కోర్సంటే అమ్మాయిలకే ప్రత్యేకం అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. ఎడ్‌సెట్‌లో మొత్తం 30,944 మంది ఉత్తీర్ణులు కాగా..వారిలో 25,220 మంది..అంటే 81.50 శాతం అమ్మాయిలే కావడం గమనార్హం. బీఈడీలో ప్రవేశానికి నిర్వహించిన ఎడ్‌సెట్ ఫలితాలను శనివారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్ బి.వెంకట్రామ్‌రెడ్డి ఇతర అధికారులు విడుదల చేశారు. ఎడ్‌సెట్‌కు 32,106 మంది హాజరుకాగా వారిలో 30,944 మంది (96.38 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఈసారి ఈ పరీక్షకు 38,754 మంది దరఖాస్తు చేయగా..వారిలో అబ్బాయిలు కేవలం 7,217

తరువాయి 2లో

## ఆరోగ్యానికి యోగాద్భుతం

- ప్రపంచానికే స్వస్థత కేంద్రంగా భారత్
- ఆధునిక పరిశోధనలతో యోగాను పరిపుష్టం చేస్తున్నాం
- వైద్యం కోసం మన దేశం వచ్చేవారికి ప్రత్యేక ఈ-ఆయుష్ వీసాలు
- స్థూలకాయం ప్రపంచానికి అతి పెద్ద సవాలు.. దాన్ని అధిగమించాలి
- విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ
- కార్యక్రమాన్ని అత్యద్భుతంగా నిర్వహించారని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు అభినందనలు
- మంత్రి లోకేశ్‌పై ప్రధాని ప్రత్యేక ప్రశంసలు

2లో





## యోగాను.. ఒలింపిక్స్‌లో చేర్చాలి

- ప్రధానికి సీఎం చంద్రబాబు వినతి
- మోదీ కృషి వల్లే యోగాకు అంతర్జాతీయ గుర్తింపు
- చరిత్రలో నిలిచిపోయేలా యోగాంధ్ర నిర్వహించాం
- అంతర్జాతీయ యోగా డేలో ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాఖపట్నం: ఒలింపిక్స్, ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో యోగాను చేర్చేలా ప్రధాని నరేంద్ర మోదీ చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. 'ప్రధాని దార్శనికత, గత పదేళ్లుగా యోగాను

తరువాయి 2లో




## ఏపీలో 'కోటా' లేదు.. తెలంగాణలో స్కూలే లేదు

- రాష్ట్రంలో కలగా మారిన సైనిక్ పాఠశాల

హైదరాబాద్: రాష్ట్ర విద్యార్థులకు సైనిక్ స్కూళ్లలో ప్రవేశం దుర్లభంగా మారింది. గత ఏడాది వరకు ఏపీలోని సైనిక్ స్కూళ్లలో లోకల్ కోటా కింద తెలంగాణ విద్యార్థులు ప్రవేశాలు పొందేవారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం (202526) నుంచి ఆ అవకాశం లేకుండాపోయింది. అటు అవకాశం లేక.. ఇటు రాష్ట్రంలో పాఠశాల లేకపోవడంతో రాష్ట్ర విద్యార్థులు సీబీఎస్ఈ సిలబస్‌తో తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను పొందని పరిస్థితి తలెత్తింది.

*** మంజూరైనా పట్టించుకోని ఫలితం..**

రాష్ట్రానికి సైనిక్ స్కూల్ మంజూరయ్యేలా 2016లో అప్పటి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చొరవ తీసుకున్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ఎలుకుర్తిలో పాఠశాల ఏర్పాటుకు 2017లో సైనిక్ స్కూల్ సొసైటీతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ కూడా కుదుర్చుకుంది. భూసేకరణలో సమస్యలు, రూ.100 కోట్ల నిధుల మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపక అది కాగితాలకే పరిమితమైంది. దేశంలో 202324 వరకు

తరువాయి 2లో

## ఇరాన్‌కు ఎదురుదెబ్బలు

- ఇజ్రాయెల్ దాడుల్లో ముగ్గురు కీలక ఐఆర్‌జీసీ కమాండర్ల మృతి
- ఇస్ఫాహాన్ అణుకేంద్రం ధ్వంసం
- ఫలించని ఐరోపా నేతల దౌత్యం

టెల్ అవీవ్/వాషింగ్టన్: ఇజ్రాయెల్‌తో శనివారం తొమ్మిదోరోజు యుద్ధంలో ఇరాన్‌కు ఎదురుదెబ్బలు తగిలాయి. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)కు చెందిన ముగ్గురు కీలక కమాండర్లను ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) మట్టుబెట్టింది. అణుస్థావరాలే లక్ష్యంగా దాడులనూ తీవ్రతరం చేసింది. కీలక ఇస్ఫాహాన్ అణుకేంద్రానికీ భారీగా నష్టం కలిగించింది. బాలిస్టిక్ క్షిపణులు తయారు చేసే కర్మాగారాలపై బాంబుల వర్షం

తరువాయి 2లో





## ఫోర్డో అణుకేంద్రంపై అమెరికా దాడి

- రంగంలోకి అమెరికా బీ-2 స్పిరిట్‌లు

2లో



## రైతుభరోసా జమ చేయకుంటే.. ఓఆర్ఆర్‌ను దిగ్బంధిస్తాం

- కోర్టులు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారట్లే
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి, జిన్నారం: రైతుభరోసా జమకాని రెండు లక్షల మంది అన్నదాతలతో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను దిగ్బంధిస్తామని మాజీ మంత్రి, భారాస సీనియర్ నేత హరీశ్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న మండలాల్లో రైతులకు పెట్టుబడి సాయం అందలేదని.. అర్హులందరికీ నిధులు జమ చేయకుంటే మహేశ్వరం, మేడ్చల్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి వంటి భారాస నేతల సహకారంతో దిగ్బంధ కార్యక్రమం చేపడతామన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 20వేల మందికి రైతుభరోసా జమకాలేదంటూ శనివారం జిన్నారంలోని అంబేడ్కర్ కూడలిలో నిర్వహించిన రైతు మహాధర్నాకు హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. 'ముఖ్యమంత్రి పటాన్‌చెరు నియోజకవర్గంపై పగపట్టడంలో అర్థం లేదు. ఆయన ఎనుమల రేవంత్‌రెడ్డి కాదు.. కోతల రేవంత్‌రెడ్డి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులకు భరోసా ఇస్తామంటూ

తరువాయి 2లో

# యోగాను ఒలింపిక్స్‌లో చేర్చాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రోత్సహించడం వల్ల అది ఇప్పుడు ఓ ఉద్యమంగా మారింది. యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించడమే కాకుండా, వివిధ దేశాల్లో ఆచరిస్తున్నారు. ఇప్పుడు యోగాలో పోటీలు నిర్వహించే దశ వచ్చింది. సెప్టెంబరులో యోగా సూపర్‌లీగ్ ప్రారంభమవుతుండటం సంతోషంగా ఉంది. చరిత్ర సృష్టించాలన్నా, రికార్డులు బ్రేక్ చేయాలన్నా అది మోదీకే సాధ్యం' అని ఆయన కొనియాడారు. శనివారం ఉదయం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 28 కిలోమీటర్ల పొడవునా, లక్షల మందితో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో చంద్రబాబు మాట్లాడారు. 'యోగా మన జీవితంలో భాగం కావాలి. ప్రతి ఒక్కరూ రోజూ గంట సమయం యోగాకు కేటాయించాలి. దీన్నొక వ్యాయామంలా భావించకూడదు. వేగంగా పురోగమిస్తున్న డిజిటల్ యుగంలో లక్ష్యశుద్ధి, క్రమశిక్షణ, సృజనాత్మకతలను పెంచుకునేందుకు ఇదో శక్తిమంతమైన సాధనం. క్రమం తప్పక యోగా చేసినవారి జీవితాల్లో అద్భుతాలు జరుగుతాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు. యోగా ద్వారా ప్రపంచశాంతికి, సంతోషకర జీవితానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

**మానసిక, శారీరక ఆరోగ్యానికి మార్గం**

యోగా సాధన మానసిక, శారీరక ఆరోగ్యానికి మార్గం చూపుతుందని చంద్రబాబు తెలిపారు. ''ప్రధాని మోదీ ఐక్యరాజ్య సమితి ద్వారా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభింపజేసి, దాన్ని ప్రపంచ ఆరోగ్య ఉద్యమంగా మార్చేశారు. ఈ రోజు యోగా డేలో ప్రపంచవ్యాప్తంగా 175కు పైగా దేశాల్లో 12 లక్షల ప్రదేశాల్లో, 10 కోట్ల మంది పాల్గొంటున్నారు. జాతి, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా యోగా అందరి ఆమోదం పొందింది. శరీరం, మనసు, ఆత్మల అనుసంధానంతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు, ఒత్తిడిని నివారించేందుకు, రోగ నిరోధకతను, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడానికి యోగాకు మించిన సాధనం లేదు. ఆత్మశోధన, మానసిక ప్రశాంతతలకు ఎంతో ఉపకరిస్తుంది. హింసను తగ్గించి, శాంతిని ప్రేరేపిస్తుంది'' అని తెలిపారు. ఏఐ సహా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు అందుబాటులోకి రావడం యోగా విస్తృతికి మరింత దోహదం చేస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

**ఇటు జనసంద్రం.. అటు జలసంద్రం**

'ఒకవైపు బంగాళాఖాతం, మరోవైపు యోగా సాధకులు.. వెరసి, విశాఖపట్నం ఈ రోజు రెండు మహాసముద్రాలను చూసింది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. యోగా డేలో పాల్గొనేందుకు స్వయంగా హాజరై ప్రేరణ ఇచ్చినందుకు ప్రధాని మోదీకి 'ఎక్స్'లో చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. 'ప్రధాని, లక్షల మంది యోగా సాధకులతో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నాను. యోగాంధ్ర విజయవంతమైంది. దీనికి కారణమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

**యోగాంధ్ర ట్రెండ్ సెట్టర్**

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో నిర్వహించేందుకు అనుమతివ్వడంతోపాటు స్వయంగా ఇక్కడికి వచ్చి యోగా డేలో పాల్గొన్నందుకు ప్రధాని మోదీకి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఆంధ్రప్రదేశ్‌కు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. 'ప్రధాని విజన్‌తో స్ఫూర్తి పొంది రాష్ట్రంలో నెల రోజులపాటు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాం. ప్రజలు దీక్షగా, ఉద్యమంలా భాగస్వాములయ్యారు. యోగాంధ్ర ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. ప్రధాని నిర్దేశించిన వికసిత్ భారత్‌లో భాగంగా 2047 నాటికి ఐశ్వర్యం, ఆనందం, ఆరోగ్యంతో తులతూగే స్వర్ణాంధ్రగా ఏపీ రూపుదిద్దుకోవాలి' అని ఆకాంక్షించారు. ప్రధాని మోదీ ప్రోత్సాహం వల్లే యోగా, ప్రకృతి చికిత్స, ఆయుర్వేదం, గ్రీన్ ఎనర్జీ, స్వచ్ఛ భారత్, ప్రకృతి వ్యవసాయం వంటివి పునరుద్ధరించడం సాధ్యమైందని గుర్తుచేశారు. ''ప్రధాని మోదీ కేవలం ఆరోగ్యవంతమైన విశ్వసమాజం కోసమే కాకుండా, భూమిని ఆరోగ్యవంతమైన గ్రహంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే 'ఒకే నేల.. ఒకటే ఆరోగ్యం' అన్న నినాదంతో విశాఖలో ఒకే ప్రాంగణంలో 3 లక్షల మందికిపైగా, రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మందితో నిర్వహించిన యోగా డే చరిత్రలో నిలిచిపోతుంది'' అని ఆయన పేర్కొన్నారు. 'మోదీ విజన్‌తో స్ఫూర్తి పొంది రాష్ట్రంలో నెల రోజులపాటు యోగాంధ్ర ప్రచారం నిర్వహించాం. 1.44 లక్షల మంది శిక్షకులకు ప్రత్యేకంగా ట్రైనింగ్ ఇచ్చాం. 1.40 లక్షలకుపైగా ప్రాంతాల్లో 2.17 కోట్ల మంది పాల్గొన్నారు. 1.70 కోట్ల మందికి ధ్రువపత్రాలు ఇచ్చాం. శుక్రవారం 22,122 మంది గిరిజన విద్యార్థులు ఒకేసారి సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ రికార్డు సాధించడం మనకు గర్వకారణం' అని చంద్రబాబు తెలిపారు.

# ఎడ్‌సెట్‌లో అమ్మాయిలదే పైచేయి

(మొదటిపేజీ తరువాయి)

తొలి 10 ర్యాంకర్లలో ఏడుగురు అబ్బాయిలున్నారు. నాలుగు, అయిదు, ఎనిమిది ర్యాంకులను మాత్రం అమ్మాయిలు దక్కించుకున్నారు. ఫలితాల విడుదల సందర్భంగా ఛైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో గత ఏడాది ఏడు ప్రభుత్వ, 201 ప్రైవేట్... మొత్తం 208 బీఈడీ కళాశాలల్లో కన్వీనర్, బి కేటగిరీ కలిపి 18,556 సీట్లున్నాయని చెప్పారు. వాటిలో కన్వీనర్ 9,144, బి కేటగిరీ 5276 చొప్పున..మొత్తం 14,420 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఈసారి కూడా అంతే మొత్తంలో సీట్లుంటాయన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు కురిక్యాల పురుషోత్తం, ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఇతర అధికారులు కరుణాకర్‌రెడ్డి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఫోర్డో అణుకేంద్రంపై అమెరికా దాడి

అమెరికా బీ2 స్పిరిట్ బాంబర్లతో ఇరాన్‌పై విరుచుకుపడింది. ఫోర్డో, నతాంజ్, ఇస్ఫాహన్ అణుకేంద్రాలపై భారీ దాడులకు పాల్పడింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. ''భారీ బాంబులు ఫోర్డోపై వేశాం. ఇరాన్ గగనతలం బయట నుంచే ఈ దాడులు చేశాం. విమానాలు సురక్షితంగా తిరుగుముఖం పట్టాయి. అమెరికా యోధులకు అభినందనలు. ప్రపంచంలో మరే మిలిటరీకి ఇది సాధ్యంకాదు. ఇప్పుడు శాంతికి సమయం'' అని పోస్టు చేశారు. మరో పోస్టులో 'ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ ప్రకారం ఫోర్డో నాశనమైంది' అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ వైమానిక సైన్యంతో కలిసి దాడి చేసినట్లు అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. తమ విమానాలు సురక్షితంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

**రెండు వారాల నుంచి రెండ్రోజుల్లోకి..**

ట్రంప్ అలవాటు ప్రకారం ఇరాన్‌కు రెండు వారాల గడువు ఇచ్చారేగానీ.. ఆయన రెండ్రోజులు కూడా ఆగలేదు. నిన్న రాత్రే అమెరికాలోని వైట్‌మన్ ఎయిర్ బేస్ నుంచి మరిన్ని బీ2 స్పిరిట్‌లు, ఎనిమిది కేసీ135 స్ట్రాటో ట్యాంకర్లు ఇండోపసిఫిక్‌లోని డియాగో గార్సియా దిశగా బయల్దేరి వెళ్లాయి. ఇవి మైటీ11, మైటీ21 అనే కాల్‌సైన్‌లు వాడినట్లు ఫ్లైట్ రాడార్ 24 పేర్కొంది. గతంలో కూడా బీ2 స్పిరిట్‌లు ప్రత్యేక ఆపరేషన్ల కోసం బయల్దేరిన సమయంలో 'మైటీ' కాల్‌సైన్‌లను వాడాయి.

ఈ దాడి నేపథ్యంలో స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు ట్రంప్ అమెరికా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ విషయాన్ని శ్వేతసౌధం ప్రకటించింది. ఈ దాడితో అమెరికా కూడా యుద్ధ రంగంలోకి ప్రవేశించినట్లైంది. ప్రస్తుతానికి అదనపు దాడుల చేసే ఉద్దేశం వాషింగ్టన్‌కు లేనట్లు సీఎన్ఎన్ పత్రిక కథనంలో పేర్కొంది. అగ్రరాజ్య ప్లానింగ్‌కు పూర్తిగా సహకరించినట్లు ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. దాడి విషయాన్ని ఇస్ఫహాన్ డిప్యూటీ గవర్నర్ అక్బర్ సలేహి కూడా ధ్రువీకరించారు. ఇస్ఫహాన్, నతాంజ్ వద్ద పలు పేలుళ్లు చోటు చేసుకున్నాయన్నారు. ఫోర్డో అణుకేంద్రం క్వామ్ నగరానికి అత్యంత సమీపంలో ఉంది. అక్కడి ప్రజలు పేలుళ్ల చప్పుళ్లు విన్నట్లు మీడియాకు వెల్లడించారు. ఈ అణుకేంద్రం ఇరాన్‌కు చాలా కీలకమైంది. అక్కడి పర్వతాన్ని తొలిచి కొన్ని వందల అడుగుల లోతులో దీనిని నిర్మించారు. 1981లో బాగ్దాద్‌లో ఇజ్రాయెల్ ఎఫ్15, ఎఫ్16 యుద్ధ విమానాలు అణు కేంద్రాన్ని ధ్వంసం చేయడాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుజాగ్రత్తగా దీన్ని నిర్మించారు. 2023లో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఇన్‌స్పెక్టర్లు ఇక్కడ 83.7శాతం శుద్ధిచేసిన యురేనియంను గుర్తించారు. అత్యంత శక్తిమంతమైన అణుబాంబుల్లో వాడే 90శాతం శుద్ధి చేసిన యురేనియంకు ఇది చాలా దగ్గర్లో ఉంది.

# ఆరోగ్యానికి యోగాద్భుతం

భారత్‌కు వెళ్లి స్వస్థత చేకూర్చుకో (హీల్ ఇన్ ఇండియా) అన్న భావన ఇప్పుడు ప్రపంచంలో విస్తృత ప్రాచుర్యం పొందుతోందని, అనారోగ్యంతో ఉన్నవారికి స్వస్థత చేకూర్చే అతిపెద్ద కేంద్రంగా భారత్ అవతరిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈ పరిణామంలో యోగా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. స్వస్థత కోసం వచ్చేవారికి ప్రత్యేక ఈఆయుష్ వీసాలు జారీచేస్తామని ఆయన ప్రకటించారు. 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు లక్షలమందితో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రధాని ప్రసంగించారు. ఇందులో పాల్గొనే అవకాశం లభించినందుకు సంతోషం వ్యక్తంచేశారు. విశాఖను అభివృద్ధి, రమణీయ ప్రకృతి సౌందర్యాల మేలు కలయికగా ఆయన అభివర్ణించారు. యోగా దినోత్సవాన్ని అత్యంత విజయవంతం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు, ప్రభుత్వ యంత్రాంగానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యద్భుతంగా నిర్వహించిందని కొనియాడారు. రాష్ట్రంలో రెండు కోట్లకుపైగా ప్రజలు పాల్గొనడం... వారిలో ఉరకలెత్తే ఉత్సాహానికి నిదర్శనమన్నారు. వికసిత్ భారత్ లక్ష్యసాధనకు ఇలాంటి స్ఫూర్తే బలమైన పునాదిగా ఆయన పేర్కొన్నారు. ''పౌరులు వారంతటవారే ఓనర్‌షిప్ తీసుకుని, చురుగ్గా పాలుపంచుకుంటే ఎంత కఠినమైన లక్ష్యమైనా అసాధ్యం కాదు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఆద్యంతం ప్రజల ఉత్సాహం, సుహృద్భావం ప్రబలంగా కనిపించాయి'' అని మోదీ పేర్కొన్నారు. కల్లోల పరిస్థితుల్లో శాంతిమార్గం యోగా ''యోగాను ఒక ప్రజా ఉద్యమంగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. అది ఈ ప్రపంచాన్ని శాంతి, ఆరోగ్యం, సామరస్యం దిశగా నడిపిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో సమతుల్యం సాధించేందుకు యోగాతో దినచర్య ప్రారంభించాలి. ఒకే భూమి, ఒకే ఆరోగ్యం అన్న నినాదం ప్రపంచ తీర్మానం కావాలి'' అని ప్రధాని ఆకాంక్షించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో పెరుగుతున్న అశాంతి, అస్థిరతపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి కల్లోల పరిస్థితుల్లో యోగా శాంతికి మార్గం చూపిస్తుందన్నారు. ''మానవ సమాజానికి యోగా ఒక 'పాజ్ బటన్'. ఒక్కసారి ఆగి ఊపిరి పీల్చుకునేందుకు, సంతులనం చేసుకునేందుకు, మళ్లీ మామూలు మనుషులయ్యేందుకు ఇది తోడ్పడుతుంది. అంతర్గత శాంతిని ప్రపంచవిధానంగా మార్చే... 'మానవాళి 2.0 కోసం యోగా' అన్న సంకల్పానికి ఈ యోగా దినోత్సవం నాంది ప్రస్తావనగా నిలవాలి. యోగా అనేది వ్యక్తిగత అభ్యసనానికే పరిమితం కాకూడదు, అది ప్రపంచ భాగస్వామ్యానికి ఒక మాధ్యమంగా మారాలి'' అని ఆకాంక్షించారు. ప్రపంచంలోని ప్రతి దేశం తమ పబ్లిక్ పాలసీల్లో యోగాను అంతర్భాగం చేసుకోవాలని ఆయన సూచించారు.

**వైద్యకళాశాలల్లో 10 రోజుల మాడ్యూల్**

యోగాతో ఆరోగ్యం అన్న నినాదాన్ని దేశవ్యాప్తంగా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో జాతీయ ఆయుష్ మిషన్ కృతకృత్యమైందని మోదీ తెలిపారు. ఈ విషయంలో సాంకేతికత కీలక భూమిక పోషించిందన్నారు. యోగా పోర్టల్, యోగాంధ్ర వెబ్‌సైట్‌ల ద్వారా అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 10 లక్షలకుపైగా కార్యక్రమాల రిజిస్ట్రేషన్ జరిగిందని, దేశంలోని ప్రతి మూలకూ యోగా స్ఫూర్తి చేరిందనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. అందరికీ అవసరమైన కొన్ని ప్రక్రియల్ని ఏర్చికూర్చి 'కామన్ యోగా ప్రొటోకాల్' పేరుతో ప్రామాణిక విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు. యోగా సర్టిఫికేషన్ బోర్డు 6.5 లక్షల మంది వాలంటీర్లకు శిక్షణ ఇచ్చిందని, 130 సంస్థల్ని గుర్తించిందని తెలిపారు. వైద్యకళాశాలల్లో పదిరోజుల యోగా శిక్షణ మాడ్యూల్‌ని చేర్చినట్టు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాల ద్వారా యోగా టీచర్లను సిద్ధం చేసినట్టు తెలిపారు.

* **యోగాతో హృద్రోగాలు,నాడీ సమస్యలకు పరిష్కారం**

యోగాభ్యాసం వల్ల చేకూరే ప్రయోజనాల్ని ప్రపంచం నలుమూలలకూ వ్యాప్తి చేసేందుకు ఆధునిక పరిశోధనల ద్వారా యోగశాస్త్రాన్ని మరింత పరిపుష్టం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. దేశంలోని ప్రముఖ వైద్య విజ్ఞానసంస్థలు యోగాపై పరిశోధనల్లో పాలుపంచుకుంటున్నాయని, ఆధునిక వైద్య విధానాల్లో యోగాకున్న ప్రాధాన్యాన్ని శాస్త్రీయంగా నిరూపించేందుకు కృషిచేస్తున్నాయని తెలిపారు. యోగా ఫలితాలకు ఆధారాలను నిరూపించడంలో ఢిల్లీ ఎయిమ్స్ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. హృద్రోగాలు, నాడీవ్యాధులు, మహిళల అనారోగ్య సమస్యల్ని నయం చేయడంలో, మానసిక శాంతిని చేకూర్చడంలో యోగా ప్రభావవంతంగా పనిచేస్తుందన్న విషయాన్ని ఎయిమ్స్ రుజువు చేసిందని ప్రధాని పేర్కొన్నారు.

**ఆ మూడూ చేస్తే ఆరోగ్యం మీ చెంతే**

''స్థూలకాయం ప్రపంచానికి అతిపెద్ద సవాలు. దాన్నుంచి బయటపడేందుకు... ప్రతి ఒక్కరూ వారి రోజువారీ ఆహారంలో వంటనూనెల వినియోగాన్ని 10% తగ్గించాలి. మన దేశ ప్రజలతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఉన్నవారంతా ఈ సవాలును స్వీకరించాలి. దీనిపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. వంటనూనెల వాడకం తగ్గించడం, ఆనారోగ్యకర ఆహారం జోలికి వెళ్లకపోవడం, క్రమం తప్పకుండా యోగా చేయడం ఆరోగ్యకర జీవనానికి సోపానాలు'' అని ప్రధాని పేర్కొన్నారు.

**మనం అన్న భావనతోనే సంక్షేమం**

''ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా అన్న ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం థీమ్‌కి విస్తృతార్థం ఉంది. ఈ భూమండలంపై ప్రతి దాని ఆరోగ్యం మరో దాంతో ముడిపడి ఉందన్న సత్యాన్ని అది బోధిస్తుంది. మనుషుల ఆరోగ్యం మనకు ఆహారాన్నందించే నేల, నీటిని అందించే నదులు, మన పర్యావరణ వ్యవస్థలో కీలకభూమిక పోషించే జంతువులు, మనకు అన్నివిధాలా మేలుచేసే మొక్కల ఆరోగ్యంపై ఆధారపడి ఉంది. యోగా అనేది మనల్ని ఈ పరస్పరాధారిత వ్యవస్థ గురించి జాగరూకుల్ని చేసి, ప్రపంచంతో ఏకత్వభావనతో ముందుకు సాగేలా మార్గదర్శనం చేస్తుంది. మొదట్లో మనం మన ఆరోగ్యం, సంక్షేమం గురించి పట్టించుకుంటాం. క్రమంగా పర్యావరణం, సమాజం, చివరకు ఈ భూమండలాన్ని రక్షించుకోవాలన్న స్పృహకు విస్తరిస్తుంది. యోగా అనేది అకుంఠితమైన వ్యక్తిగత క్రమశిక్షణకు, వ్యక్తులు నేను అన్న భావన నుంచి మనం అన్న భావన దిశగా పరిణామం చెందేందుకు దోహదం చేస్తుంది. ఇలా మారడమే నిజమైన భారతీయ ఆత్మకు ప్రతీక. 'సర్వేభవంతు సుఖిన' అంటూ భారతీయ సంస్కృతి మనకు బోధించే తత్వం సారాంశం అదే. మానవాళి సంక్షేమం కోరుకోవడం ప్రతి ఒక్కరి పవిత్ర కర్తవ్యం'' అని ఆయన తెలిపారు.

# ఏపీలో 'కోటా' లేదు..తెలంగాణలో స్కూలే లేదు

(మొదటిపేజీ తరువాయి)

33 సైనిక్ స్కూళ్లు ఉన్నాయి. కేంద్ర రక్షణ శాఖ సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు 2022లో కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చి దేశవ్యాప్తంగా 100 పాఠశాలల ఏర్పాటుకు నిర్ణయించింది. ఆ ప్రకారం స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు కూడా వాటిని ఏర్పాటు చేసుకోవచ్చు. కొత్త విధానంలో కేంద్రం ఇప్పటివరకు ఒక్కటీ 40 పాఠశాలలను మంజూరు చేసింది. ఆ విధానంలో కూడా రాష్ట్రానికి దక్కలేదు. ఏపీలో మరొకటి కొత్తగా ఏర్పాటైంది. గోవా, ఒకటీ రెండు ఈశాన్య రాష్ట్రాల మినహా అన్ని రాష్ట్రాల్లో సైనిక్ స్కూళ్లు ఏర్పాటయ్యాయి. ఏడాదిన్నర క్రితం సీఎం రేవంత్‌రెడ్డి రక్షణ శాఖ మంత్రిని కలిసి రాష్ట్రానికి పాఠశాలను మంజూరు చేయాలని కోరినా ఫలితం లేదు. కొత్త విధానంలో పాఠశాలల మంజూరుకు జులై 14 వరకు దరఖాస్తుకు గడువు ఉండడంతో తాజాగా పలువురు తల్లిదండ్రులు తెలంగాణ సైనిక్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్‌గా ఏర్పాటై.. ఫోర్త్ సిటీలో రెండు సైనిక్ స్కూళ్లు నెలకొల్పాలని సీఎంను కోరారు. ఇతర రాష్ట్రాల్లోని స్కూళ్లలో స్థానికేతర కోటా కింద (33 శాతంలో) మాత్రమే చేరేందుకు అవకాశం ఉంటుందని, దానివల్ల అతి తక్కువ సీట్లు మన విద్యార్థులకు దక్కుతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

**ఇదీ ప్రయోజనం..**

సైనిక్ పాఠశాలల్లో 6నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌తో ఆంగ్ల మాధ్యమంలో విద్య అందిస్తారు. వన్ స్కూల్ వన్ స్పోర్ట్స్ నినాదంతో ఏదైనా ఒక క్రీడలో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందుతుంది. కొత్త విధానంలోని పాఠశాలల్లో చేరేవారికి మెరిట్ ఆధారంగా ఫీజులో 50 శాతం (గరిష్ఠంగా రూ.40 వేలు) కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది.

# రైతుభరోసా జమ చేయకుంటే.. ఓఆర్ఆర్‌ను దిగ్బంధిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పటాన్‌చెరు, మేడ్చల్ నియోజకవర్గాల అన్నదాతలకు మొండిచేయి చూపడం సరికాదు. కొవిడ్ సమయంలో తీవ్ర ఆర్థిక కష్టాలున్నా.. రైతులకు కేసీఆర్ అండగా నిలిచారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లు వచ్చినప్పుడే రైతుభరోసా నిధులు జమచేస్తున్న విషయాన్ని ప్రజలు గమనించాలి.

* **కేసులు పెట్టినా.. ప్రజల పక్షాన పోరాడతాం**

గతంలో నేను మానకొండూరులో జరిగిన సమావేశంలో ఎగవేతల రేవంత్‌రెడ్డి అంటే కేసు పెట్టారు. ఇప్పుడు కోతల రేవంత్ అంటే అదేపని చేస్తారేమో. ఎన్ని కేసులు పెట్టినా, నిర్బంధాలు, అక్రమ అరెస్టులు చేసినా.. రైతులు, ప్రజల పక్షాన పోరాటం చేస్తాం. కోర్టులు మొట్టికాయలు వేసినా ప్రభుత్వం తీరు మారడం లేదు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పోటీ పడి ఫార్ములా ఈ రేస్ పోటీలు నిర్వహిస్తే మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు పెట్టారు. ఎవరూ ఇష్టపడని అందాల పోటీలు నిర్వహించి పరువు తీశారు. సీఎం అనుచరులు ఇద్దరు మిస్ ఇంగ్లాండ్‌తో అనుచితంగా వ్యవహరించారు. ఇందుకు ముగ్గురు అధికారులతో కమిటీ వేయడమే నిదర్శనం' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు '2028లో రప్పా రప్పా 3.0 లోడింగ్' అంటూ ప్రదర్శించిన ఫ్లెక్సీలు చర్చనీయాంశమయ్యాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌కు ఎదురుదెబ్బలు

(మొదటిపేజీ తరువాయి)

కురిపించింది. కుజెస్థాన్ ప్రావిన్స్‌లో ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాలనూ నాశనం చేసింది. ఇరాన్ కూడా డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసినా ఇజ్రాయెల్ సమర్థంగా అడ్డుకుంది. మరోవైపు యుద్ధానికి సంబంధించి ఐడీఎఫ్ కీలక ప్రకటన చేసింది. తాము సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. అణుకేంద్రాలను, క్షిపణి మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని అధికారిక ప్రతినిధి ఎఫ్ఫీ డెఫ్రిన్ స్పష్టంచేశారు. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఐరోపా విదేశాంగమంత్రులు, ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య జరిగిన చర్చలు ఫలవంతం కాలేదు. దీంతో యుద్ధం అంత త్వరగా ముగియదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. అమెరికా యుద్ధంలో పాల్గొనడంపై రెండు వారాల తర్వాత నిర్ణయం తీసుకుంటానని ట్రంప్ ప్రకటించినా, అగ్రరాజ్యం బరిలోకి దిగితే యుద్ధం మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తుందన్న ఆందోళనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అరాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్‌కు అండగా అమెరికా దిగితే అది అందరికీ చాలా ప్రమాదకరమని అన్నారు.

ఇప్పటివరకు 430 మంది చనిపోయారని, 3,500 మందికి గాయాలయ్యాయని ఇరాన్ శనివారం తెలిపింది. టెహ్రాన్ దాడుల్లో 25 మంది మృతి చెందారని, 2,517 మంది క్షతగాత్రులయ్యారని ఇజ్రాయెల్ పేర్కొంది.

**ఫలించని దౌత్యం**

ఇరాన్ అమెరికా మధ్య అణుచర్చలు తిరిగి ప్రారంభించడానికి ఐరోపా నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బ్రిటన్, ఐరోపా యూనియన్, జర్మనీ, ఫ్రాన్స్‌లకు చెందిన విదేశాంగమంత్రులు శుక్రవారం జెనీవాలో ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీతో 3 గంటలకు పైగా సమావేశమయ్యారు. అమెరికాతో అణుచర్చలను తిరిగి ప్రారంభించాలని మాత్రమే ఇరాన్‌కు ఐరోపా నేతలు సూచించారు. అనంతరం అరాగ్చీ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఇజ్రాయెల్ దూకుడు ఆపితేనే అమెరికాతో చర్చల అంశాన్ని ఇరాన్ పరిశీలిస్తుందని తెలిపారు.

**'ఖుద్స్ ఫోర్స్' దళపతుల హతం**

ముందు నుంచి ఇరాన్ సైనికాధికారులను లక్ష్యంగా చేసుకుంటున్న ఇజ్రాయెల్ శనివారం కీలక కమాండర్లను హతమార్చింది. ఇరాన్‌లోని కూమ్ నగరంలో ఓ అపార్టుమెంటుపై దాడి చేసి ఐఆర్‌జీసీ సీనియర్ కమాండర్ సయిద్ ఇజాదీని మట్టుపెట్టింది. ఈ విషయాన్ని. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ శనివారం ప్రకటించారు. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబరు 7న హమాస్ చేసిన ఉగ్రదాడికి ఇజాదీయే ఆర్థిక, ఆయుధ సాయం చేశారని మంత్రి పేర్కొన్నారు. ఐఆర్‌జీసీలో శక్తిమంతమైన 'ఖుద్స్ ఫోర్స్'లో పాలస్తీనా విభాగానికి ఇజాదీ అధిపతి. పశ్చిమ ఇరాన్‌లో చేసిన డ్రోన్ దాడిలో 'ఖుద్స్ ఫోర్స్'కే చెందిన ఆయుధాల సరఫరా విభాగం కమాండర్ బెహ్నామ్ షహర్యారిని కూడా ఐడీఎఫ్ హతమార్చింది. హమాస్, హెజ్‌బొల్లా, హూతీ సంస్థలకు ఆయుధాల సరఫరాలో షహర్యారి ప్రధాన పాత్ర పోషించినట్లు తెలిపింది.

# రైతన్న జీవితాల్లో వెలుగులు నింపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి**

**- సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చిత్ర పటాలకు పాలాభిషేకం**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్న జీవితాల్లో వెలుగులు నింపుతున్నదని కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయడంతో ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో రైతులతో కలిసి సంబరాలు కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నెముకైనా రైతును కాంగ్రెస్ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతుల పార్టీ అన్నారు. ఆనాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుండి ఈనాటి రేవంత్ రెడ్డి హయాం వరకు రైతులకు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలని లక్ష్యంతోనే కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన సంవత్సర కాలంలోనే రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చి చేసి చూపించామని అన్నారు. రాష్ట్రంలోని దాదాపు 30 లక్షల వరకు రైతుల యొక్క దాదాపు 25 వేల కోట్ల వరకు రుణాలు మాఫీ అయ్యాయని అన్నారు.అలాగే రైతు భరోసా కింద పంట పెట్టుబడి సహాయం ఇంతక ముందు ప్రభుత్వం ఇచ్చినట్లుగా రాళ్ళకు, గుట్టలకు, వెంచర్స్‌కి,



రోడ్లకు కాకుండా పండిచే ప్రతి రైతుకు లబ్ధి చేకూర్చాలి అనే ఉద్దేశంతో వ్యవసాయ అధికారులతో మళ్లీ సర్వే చేయించి, కేవలం పంట పండిచే రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. సన్న వడ్లు పండిస్తే క్వింటాలకు 500 చొప్పున బోనస్ చెల్లించడం ఇలాంటి రైతులకు మేలు చేసే కార్యక్రమాలు ఎన్నో చేపట్టడం గర్వకారణమని, ఈ ఘనత దేశంలో కేవలం తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీకే దక్కిందని అన్నారు. సబ్సిడీలో రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించే పథకాన్ని ఆనాడు కాంగ్రెస్ పార్టీ తెస్తే బిఆర్ఎస్ దాన్ని బొంద పెట్టి కేవలం వారి కార్యకర్తలకు లబ్ధి చేకూర్చేలా సబ్సిడీ ట్రాక్టర్లను ఇచ్చిందని, కానీ ఇప్పుడు మళ్ళీ ఆ పథకాన్ని తీసుకురావాలనే ఆలోచన మొన్న జరిగిన క్యాబినెట్ లో చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ విధంగా ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తూ అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ తెలంగాణ రైసింగ్ నెంబర్ 1 విజన్ 2047 తో ముందుకు వెళుతుంటే ఇది ఓర్వలేని బీఆర్ఎస్ నేతలు వారి స్థాయిని మరచి అహంకారంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. మళ్ళీ ఇంకోసారి కాంగ్రెస్ పార్టీపైన గానీ, నాయకులపైన గానీ ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి ఎల్లా గౌడ్, ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, గూడెం గ్రామ శాఖ అధ్యక్షులు సడిమెల బాలయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజన్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొప్ప శంకర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిడిదొడ్డి భాను కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు ఎద్దండి మహేందర్, సీనియర్ నాయకులు ఓదేల శ్రీను, బొప్ప వెంకట రమణ, బొప్ప విష్ణు తదితరులున్నారు.

## బొమ్మల రామారాం మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రంగాపురం గ్రామం హైదరాబాద్ డిఫెన్స్ కళాశాల లో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి జిల్లా అధ్యక్షుడు వూట్కూరి అశోక్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శిలు, జిల్లా నాయకులు, మండల ఉపాధ్యక్షులు, బూత్ ప్రెసిడెంట్ లు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంటే... ఛార్జీల పేరుతో దండుకుంటున్నారు

*** బిజెపి ముస్తాబాద్ మండల ప్రధాన కార్యదర్శి బాద నరేష్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుంటే రవాణా ఛార్జీల పేరుతో ట్రిప్‌కు ఇంత అంటూ దండుకుంటున్నారని బిజెపి ముస్తాబాద్ మండల ప్రధాన కార్యదర్శి బాద నరేష్ ఆరోపించారు. నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందని, ఇప్పటికై అధికారులు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు కూడా పంపిణీ చేయడం కూడా జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే నిరుపేదలకు ఇసుక భారం కాకూడదని ఫ్రీ ఇసుకకు పర్మిషన్ ఇచ్చిందని, కానీ దీన్ని కొందరు దళారులు ఆసరగా చేసుకుంటున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ యాజమానులు ఇసుక రవాణా చేసేందుకు ఒక ట్రిప్పుకు 4500 నుంచి 5000 వరకు చార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. మీ ఇష్టం ఉంటే తీసుకోవచ్చు... లేకపోతే లేదని అంటున్నారని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇసుక ఉచితమైన ఇసుక రవాణా చార్జీల భారంగా మారడంతో లబ్ధిదారులు ఆందోళన గురవుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఇసుక రవాణా చార్జింగ్ తగ్గించాలని, దీనిపై కలెక్టర్ స్పందించాలని, లేనిపక్షంలో లబ్ధిదారులతో ఆందోళన కార్యక్రమం చేపడతామని అన్నారు.

## ఓబిసి బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: జనరల్ మేనేజర్ సర్వే గా రాఘవేంద్రరావు పదోన్నతి పొందిన సందర్భంగా స్థానిక ప్రాజెక్ట్ ప్లానింగ్ లోని జనరల్ మేనేజర్ సర్వే ఆఫీసు నందు బీసీ అండ్ ఓ బి సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, బీసీ సర్వే అధికారులు సిబ్బంది కార్పొరేట్ బీసెంట్ ఓబీసీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అసోసియేషన్ తరపున వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మన అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ అమి రి శెట్టినాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వి వెంకటేశ్వరరావు, నల్లపూరి రమేష్ జనరల్ సెక్రెటరీ సెంట్రల్ కమిటీ సభ్యులు టి నరేంద్రబాబు, కెవి ప్రకాష్, దావూద్, కార్పొరేట్ లైసెన్ ఆఫీసర్ వేముల మురళి, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ గోలి వెంకటేశ్వర్లు, డీజీఎం బ్రాంచ్ కార్యదర్శి సతీష్, బ్రాంచ్ నాయకులు వెంకటరమణ, జల్లారం శ్రీనివాస్ కృష్ణ ప్రసాద్ సర్వే అధికారులు యాదగిరి మన అడ్వైజర్ కార్పొరేట్ కమిటీ, విజయ్ చందర్, నాగరాజు, రవికుమార్, శరత్ బాబు, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో అలవాటుగా మార్చుకోవాలి

**: ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: యోగా ద్వారా పని ఒత్తిడి నుండి ఉపశమనం కలగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్ లో యోగా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొని మాట్లాడుతూ, ఆనందమయమైన జీవితానికి ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో అలవాటుగా చేసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉంటూ ఆనందమైన జీవితానికి యోగా ఉపయోగపడుతుందని, వేల సంవత్సరాల నుండి యోగా భారత దేశ సంస్కృతిలో బాగంగా ఉండడం మనకు దక్కిన గొప్ప గౌరవం అని, ప్రపంచ దేశాలు యోగా ప్రాముఖ్యతను తెలుసుకొని ప్రత్యేక గుర్తింపును ఇచ్చాయని అన్నారు.చేసే పనిపై శ్రద్ధ పెరుగుటకు, మానసిక ప్రశాంత కొరకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఎప్పుడూ పని ఒత్తిడిలో ఉండే వారికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను నిజ జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని అన్నారు. చిన్న పిల్లలకు డబ్బును కాకుండా యోగాను అందిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో యోగాసనాలు, ధ్యానం, శ్వాస పైన ధ్యాస, సూర్య నమస్కారాలు, ప్రాణాయామము తదితర ఆసనాలపై వాటి వలన కలిగే ప్రయోజనాల గురించి తెలియజేయడం జరిగితుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం జూన్ 26 మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని, రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల పాటు నిర్వహించనున్న వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, కొత్తగూడెం సబ్ డివిజన్ లోని పోలీస్ అధికారులు, ఆర్ఐలు, ఏఆర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట లో రచ్చబండ కార్యక్రమం




యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : యాదగిరిగుట్ట పట్టణంలోని పాత గుండ్లపల్లి లో బిజెపి ఆధ్వర్యంలో కర్రె ప్రవీణ్ సభా అధ్యక్షతన రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరిగింది దీనికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాల పాలన పూర్తి అయిన సందర్భంగా గ్రామ గ్రామాన, పట్టణాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది లబ్ధిదారులకు పథకాలు ఆదుతున్నాయా లేదా ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేస్తున్నాయా లేదా ప్రజా స్పందన కోసం రచ్చబండ ఏర్పాటు చేయడం జరిగింది ఈ యొక్క పట్టణంలో ఇందిరమ్మ ఇండ్ల, పెన్షన్ ల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుంది డబ్బున్న వాళ్లకి మరి కాంగ్రెస్ కార్యకర్తలకి ఇందిరమ్మలలో కేటాయిస్తున్నారు నిజమైన పేద వాళ్లకు న్యాయం జరగడం లేదు 60 గజాల ఇందిరమ్మ ఇల్లు కట్టాలంటే తాపీ మేస్త్రి 3 లక్షల రూపాయల ఖర్చవుతుంది 100 గజాల ఇల్లు కట్టాలన్నా కూడా మూడు 3 ఖర్చు అయితుంది దీని ద్వారా లబ్ధిదారుల నష్టపోతున్నాడు కావున 100 గజాల ప్లాట్లు ఇల్లు కట్టినా కూడా అభ్యంతరం వ్యక్తం చేయకుండా 60 గజాలకి ఇచ్చేటువంటి ఐదు లక్షల రూపాయలు సాంక్షన్ చేయాలి ఇట్టి పథకంలో కేంద్రం ఒక యూనిట్ కి 275000 చెల్లిస్తుంది తెలంగాణ మొత్తం 2 లక్షల కేంద్రం మంజూరు చేసింది గౌరవ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే ప్రజల పైన పాలన కంటే తనకు లగ్జరీ సోకులు ఎక్కువ అయినయి ఎమ్మెల్యే అయినా తక్కువ కాలంలోనే అక్రమంగా ఆస్తులను కూడబెడుతున్నాడు మొన్నటి మొన్న బర్త్డే ఫంక్షన్ లో రెండున్నర కోట్లు చేసే కారు కొని తన కూతురు గిఫ్ట్ ఇచ్చిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది మరి మీ కుటుంబం చేసిన వ్యాపారాలు అయిందో వ్యాపార రహస్యాలు ఆలేరు యువతకు చెప్తే వాళ్లు కూడా అలానే ఆర్థిక అభివృద్ధి పొందుతారు మీ అక్రమ సంపాదనకు కుటుంబ సభ్యుల పేర్లు వాడుకోవడం సిగ్గుచేటు ఇప్పటికైనా సోషల్ మీడియా డబ్బా తగ్గించి నిన్ను ఎన్నుకున్న ఈ ఆలేరు ప్రజలకు న్యాయం చేయాలని లేని పక్షంలో గ్రామాల్లో కూడా మీరు తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరిస్తున్నాం అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ నెంబర్ రచ్చ శ్రీనివాస్, బిజెపి జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్రమౌళి, పట్టణ ప్రధాన కార్యదర్శిలు మందోజు నరేష్, జిల్లా భానుచందర్, కార్యదర్శి ఆవుల సత్యనారాయణ, దొమ్మాట ప్రభాకర్, పలుగుల సురేష్, సీనియర్ నాయకులు నల్ల వెంకటరెడ్డి, బంధారపు మల్లేష్ గౌడ్, బొమ్మగాని రాజమణి, బెల్దే అశోక్, నల్ల వాసుదేవ రెడ్డి, దొమ్మాట నరేష్ బోడ బుచ్చిబాబు, సుధా గాని శివ, శివరాత్రి వంశీ, నవీన్, బండ కింది సాయి, బొమ్మ నరేష్, ఉమా మహేష్, మెరుగు శ్రీకాంత్, భోగా అజయ్, సంద ప్రవీణ్, కాలూరి విజయ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారు

*** బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : వయో తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా (యోగాసనాలు)చేయడంతో సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటా రని బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ అన్నారు. శనివారం ప్రపంచ యోగ దినోత్సవ సందర్భంగా పటేల్ కుంట పార్కులో యోగా గురువులు రాజశేఖర్, కెప్టెన్ భీమయ్య ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యోగా కార్యక్రమంలో, పాల్గొన్న గారు. వారు మాట్లాడుతూ ప్రాచీన కాలంలో యోగను మన పూర్వీకులు అభ్యసించి వారి యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకున్నారు. అవతార పురుషుడు మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ 200 దేశాలను ఒప్పించి మన యొక్క యోగ గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేసి ఈ యొక్క యోగా దినాన్ని ప్రపంచ యోగ డే గా వారి ఒప్పించి ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకునేలా చేసిన మన ప్రధానమంత్రికి మనం అందరం రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో యోగా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు సబ్ జైల్లో అంతరాతీయ యోగ దినోత్సవం



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: స్థానిక ఇల్లందు సబ్ జైల్లో ఉన్న సిబ్బందికి యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్ జైలు పర్యవేక్షణ అధికారి యన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి మనిషికి తప్పనిసరిగా ఉండవలసింది ఆరోగ్యం అని ఆరోగ్యంగా ఉంటేనే మనం ఏ పనైనా చేయగలమని అందుకే ఆరోగ్యమే మహాభాగ్యము అని అందువలన ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని చెప్పారు.. ఇంకా ఈ కార్యక్రమంలో సిబ్బంది భుజంగరాజు, శ్రీను, రవి, సాంబశివరావు, దూదియ, భాస్కర్, శాంతి స్వరూప్, నవీన్ లు పాల్గొన్నారు.

## నీట్ 100 వ ర్యాంక్ విద్యార్థిని ప్రియాంకను అభినందించిన జిల్లా ఎస్పీ

*** జేఈఈ అడ్వాన్స్ లో 657 ర్యాంకర్ శ్రీమాన్..**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో నల్లగొండ ఎస్ ఆర్ కాలేజ్ కి చెందిన విద్యార్థిని బచ్చు ప్రియాంక ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు {R) సాధించిన విషయం తెలిసేందే . శనివారం నల్లగొండ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ తన క్యాంప్ లో ఆఫీస్ లో బచ్చు ప్రియాంక నీట్ 100 ర్యాంక్ విద్యార్థి తొపాటు లచ్చుమల్ల శ్రీ మాన్ రాజ్ తండ్రి శ్రీ రామ్ (డిఎస్పి ఆఫీస్ లో రైటర్) లని ఎస్పీ శాలువలు తొ సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు అలాగే ప్రియాంక, శ్రీ మాన్ రాజ్ తల్లితండ్రులాను, ప్రియాంక చదివిన ఎస్.ఆర్ కళాశాల యాజమాన్యం ని అభినందించారు .ఈ కార్యక్రమంలో అడిషనల్ రమేష్ డి.ఎస్.పి కె.శివరాం రెడ్డి ఎస్.ఆర్ కాలేజ్ నల్గొండ జోనల్ ఇంచార్జి దోనాల శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి కి ఘన స్వాగతం



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : తెలంగాణ రాష్ట రెవిన్యూ, భవన నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యేటనలో భాగంగా ఇల్లందు నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు, బహిరంగ సభకు ముఖ్య అతిధి గా విచ్చేస్తున్న సందర్భంగా ఇల్లందు మండలం రొంపేడు చెక్ పోస్ట్ వద్ద ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య తో కలిసి వారికి ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు కండువా వేసి స్వాగతం పలికారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చిన తర్వాతనే ఓట్లు

*** పినపాక నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.**



ఇల్లందు, ప్రజా స్ఫూర్తి: అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చిన తర్వాతనే మళ్లీ ఓట్లు అడగటానికి ప్రజల వద్దకు వస్తానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం పినపాక నియోజకవర్గం పర్యటనలో భాగంగా ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించి పలు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు మరియు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటిడిఏ పిఓ రాహుల్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా గుండాల మండలం జగ్గు తండా గ్రామం నుండి లక్ష్మీదేవి పల్లి వరకు రెండు కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఆళ్లపల్లి మండలం ఆళ్లపల్లిలో నూతనంగా మూడు కోట్ల 35 లక్షల రూపాయలతో నిర్మించిన కస్తూరిబా గిరిజన బాలికల పాఠశాల, వసతి గృహం, 82 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రహరీ గోడను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆళ్లపల్లి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులైన బత్తిని శ్రీలత భర్త శ్రీధర్ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల 227 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గుండాల మండలం మామ కన్ను గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 20 లక్షల నిర్మాణ వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. గుండాల మండలం లింగగూడెం గ్రామం లో చీమల గూడెం ఆర్ అండ్ బి రోడ్డు నుండి ఇప్పల గుంపు వరకు కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుండాల మండలంలో చిన్న ముత్తయ్య, తండ్రి మల్లయ్య ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి గుండాల మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు 16 మందికి మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిందని, పేద తల్లిదండ్రులకు వారి పిల్లలను చదివించాలని కోరిక ఉన్నప్పటికీ చదివించుకోలేని దుస్థితి గత ప్రభుత్వం కల్పించిందన్నారు.. గత సంవత్సరంలో పదవ తరగతి లో 100% ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేసిన ఆళ్లపల్లి కస్తూరి బా గిరిజన వసతి గృహ పాఠశాల సిబ్బందిని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి, మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత ప్రభుత్వం పేదోడి కష్టాలను పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పరుస్తూనే, గత ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తూ, ఈ ఇందిరమ్మ ప్రభుత్వం పేదల సంక్షేమానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కే గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదవారికి మెరుగైన వైద్య సహాయం కోసం 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ అమలు, పేద విద్యార్థుల సంక్షేమానికి 40 శాతం మిస్ చార్జీల పెంపు, విద్యార్థుల కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచింది ఈ ఇందిరమ్మ ప్రభుత్వమే అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో 17 వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తే ఈ ఇందిరమ్మ ప్రభుత్వం కేవలం 10 నెలల్లో 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిందన్నారు. రైతుబంధు ద్వారా గత ప్రభుత్వం ఎకరానికి రెండు పంటలకు పదివేల రూపాయలు ఇస్తే ఈ ప్రభుత్వం 12000 రైతు భరోసా ఇస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బొమ్మ ఇళ్లను చూపించి ప్రజలకు మాయమాటలు చెప్పి రెండు సార్లు అధికారంలోకి వచ్చిందని, పేదల సొంతింటి కలను నెరవేర్చే విధంగా ఇందిరమ్మ ప్రభుత్వం మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇండ్లకు ప్రతి ఇంటికి ఐదు లక్షల రూపాయల చొప్పున ఇస్తుందన్నారు. పినపాక నియోజకవర్గం లో 4, 500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా వాటికై 225 కోట్ల రూపాయలను కేటాయించామన్నారు. ఇంకా మూడు విడతల్లో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, చేసిన తర్వాతనే ఓట్లు అడగటానికి వస్తామన్నారు. పేదల కష్టం తీర్చడానికి ఏర్పడిన ఈ ప్రభుత్వంలో ఎంతో కాలం నుండి సాగు చేస్తున్న వారికి ఇటువంటి ఇబ్బందులు కలగా చేయవద్దని ఏదైనా సమస్యలు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తారని మంత్రి తెలియజేశారు.

## యోగా అనేది మన ఆరోగ్యానికి ఎంతో మంచిది

*** సంస్కృతి పాఠశాల కరస్పాండెంట్ గడ్డమీది బాలరాజు**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : యోగా అనేది మన ఆరోగ్యానికి ఎంతో మంచిది యోగ చాలా రోగాలను నిరోధిస్తుందని సంస్కృతి పాఠశాల కరస్పాండెంట్ గడ్డమీది బాలరాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలోని సంస్కృతి పాఠశాలలో విద్యార్థుల చే యోగా అసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ., ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పంచశీల పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : యోగా అనేది కేవలం వ్యాయామం కాదు అది మన మనసును శరీరాన్ని నియంత్రించె సాధనం అని పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ అన్నారు. మూస పేట లోని పంచశీల స్కూల్ లో శనివారం అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు యోగాసనాలు, ప్రాణాయామము విశిష్టతను చాటి చెప్పేలా ప్రదర్శన ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం కాదు అది మన మనసును శరీరాన్ని నియంత్రించె సాధనం ఏకాగ్రతను పెంచే ప్రక్రియా అని యోగా యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గోనడం జరిగింది.

## ఘనంగా ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయులు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు అన్నారు. శనివారం ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని తన రచనలతో ఎండగట్టి, తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం దశాబ్దాల తరబడి కృషిచేసి, స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయులు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, ఉద్యమకారులు, బిఆర్ఎస్ కార్యకర్తలు.తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాల వ్యాపారుల (బుక్ స్టాల్స్) పై చర్యలు తీసుకోవాలి

**: పీడీఎస్‌యు**



ప్రజాస్ఫూర్తి ఇల్లందు: ఇల్లందు పట్టణంలో పాఠ్యపుస్తకాల వ్యాపారాలు (బుక్ స్టాల్స్ యజమానులు)తమ ఇష్టానుసారంగా పాఠ్య పుస్తకాలను అధిక రేట్లకు విక్రయిస్తున్నారని తక్షణమే విద్యాశాఖ అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని పి డి యస్ యూ ఇల్లందు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.సాయి, ఎ.పార్థసారథీ కోశాధికారి గంగాధరి గణేష్ డిమాండ్ చేశారు. శనివారం పి డి యస్ యూ ఇల్లందు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాల వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఇల్లందు మండల ఎంఈఓ ఉమాశంకర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ పేరుతో పాఠ్యపుస్తకాల వ్యాపారాలు దందా కొనసాగిస్తున్నారని ఎమ్మార్పీ ధరలకు కాకుండా వారి ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించుకొని ఎలాంటి నియంత్రణ లేకుండా తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి పాఠ్యపుస్తకాలు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని ఉన్నప్పటికీ నిబంధనలు ఖాతారు చేయకుండా విచ్చలవిడిగా దోచుకుంటున్నారని అన్నారు. నర్సరీ నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థుల వద్ద నుండి మూడు వేల నుండి 15వేల వరకు డబ్బులను లాగేసుకుంటున్నారని దీనితో పేద వర్గాలకు చెందినవారు వీరి దోపిడీని నియంత్రించే వారే లేరా అంటూ ఆవేదన చెందుతున్నారని తెలిపారు. వారు పాఠ్యపుస్తకాలు విక్రయించిన తర్వాత పెద్ద మొత్తంలో నగదు తీసుకొని వారి షాప్ పేరుతో కాకుండా ఎలాంటి ఆధారాలు లేని నకిలీ బిల్లులను కొనుగోలు చేసిన వారికి ఇస్తున్నారని అన్నారు. అనేకమంది తమ వద్ద డబ్బులు లేక ప్రతిరోజు కుప్పలు కుప్పలుగా బుక్ స్టాల్స్ చుట్టూ తిరిగి ధరలు అధికం కావడంతో పాఠ్యపుస్తకాలు కొనలేక తిరిగి వెళ్ళిపోతున్నారని తెలిపారు. పుస్తకాలపై లాభాల వేటలో ఉన్న వ్యాపారులను నియంత్రించి ప్రభుత్వ నిబంధనలకు లోబడి పాఠ్యపుస్తకాలు విక్రయించే విధంగా చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు.

## యోగాని జీవితంలో భాగం చేసుకోవాలి

*** ప్రకృతి ఆశ్రమంలో యోగా డే**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని, తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాలను అదుపు చేసుకోవచ్చని పలువురు వక్తలు అన్నారు. శనివారం ప్రకృతి ఆశ్రమంలో అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మనం శారీరకంగా బాగుంటేనే మన ఆరోగ్యం బాగుంటుంది.. మన కుటుంబం, సమాజం, ప్రపంచం బాగుంటుందన్నారు. 2025 సంవత్సరానికి గాను, యోగా నినాదాన్ని ముందుకు తీసుకు వెళ్లాలంటే భూమిని కాపాడుకుంటూ, ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. యోగా వలన శరీర సమతుల్యత ఏర్పడుతుందనీ, స్వయం ప్రతిబంధక వ్యాధులు కంట్రోల్ లో ఉంటాయనీ, శ్వాసక్రియ కూడా నిలకడగా ఉంటుందన్నారు. శరీరంలో ఉన్న అవయవాల అన్నిటికీ రక్తప్రసరణ మెరుగవుతుందనీ, వెన్నెముక దృఢత్వం పెరుగుతుందనీ, నిత్యం పనుల ఒత్తిడితో సతమతమయ్యే వారి మనసుకి సాంత్వన చేకూరుతుందనీ వెల్లడించారు. సంపూర్ణ ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం, సమాజ ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే యోగాని సొంతం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి అతిథులుగా పాల్గొని మాట్లాడినవారిలో.. సింగరేణి ఏజీఎం గోనె శ్రీకాంత్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు సంఘం వెంకట పుల్లయ్య, పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్య, సింగరేణి రిటైర్డ్ జిఎం శనగ వెంకటేశ్వర్లు, ప్రముఖ వైద్యులు కనకరాజు, టేకులపల్లి సిడిపిఓ తార, రిటైర్డ్ సిడిపిఓ కనకదుర్గలు మాట్లాడగా, రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్ తిరుపాలు, ఆశ్రమం కో_ఆర్డినేటర్, యోగ ఇన్స్ట్రక్టర్ సుగుణ రావు, ఆశ్రమం సభ్యులు కే హెచ్ ప్రసాద్, కుమార్, జంపన్న, రాజేష్, విష్ణు కుమార్ పంచార్య, రాజమణి, శివ, శోభారాణి, స్వరూప, ఉమా, పిచ్చయ్య పాల్గొన్నారు. యోగ ఆసనాలను ప్రోటోకాల్ ప్రకారం సీనియర్ యోగ మాస్టర్ రాజేంద్రప్రసాద్, సుగుణారావులు చేయించగా, మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆశ్రమంలో మొక్కను నాటారు.

## ఆ వార్తలన్నీ ఫేక్.. ఇజ్రాయెల్‌లోని భారత్ ఎంబసీ క్లారిటీ

ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులందరూ అక్కడున్న మన రాయబార కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకొని స్వదేశానికి రావాలని, లేనిపక్షంలో జరిమానా లేదా జైలు శిక్ష ఎదుర్కోవాల్సి వస్తుందనే ప్రచారం సోషల్ మీడియాలో కొనసాగుతోంది. తాజాగా వీటిపై భారత ప్రభుత్వం స్పందించింది. ఆ సమాచారం నిజం కాదని, సామాజిక మాధ్యమాల్లో ఫార్వర్డ్ అయ్యే అటువంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని స్పష్టం చేసింది. ఇజ్రాయెల్‌లో ఉన్న భారత పౌరుల పేర్లు నమోదు అనేది సంక్షోభ సమయాల్లో వారిని సంప్రదించేందుకు వీలు కల్పించడంతో పాటు మన ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, సౌకర్యాలు పొందేందుకు అవకాశం కల్పిస్తుందని ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. కచ్చితమైన సమాచారం కోసం ఎంబసీ అధికారిక అప్‌డేట్‌లపై ఆధారపడాలని సూచించింది.

### 827 మంది స్వదేశానికి..

ఆపరేషన్ సింధులో భాగంగా తాజాగా మరో 310 మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. ఇరాన్‌లోని మహ్‌షాద్ నుంచి బయలుదేరిన ఈ విమానం శనివారం సాయంత్రం 4.30 గంటలకు దిల్లీ చేరుకున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. దీంతో మొత్తంగా ఇప్పటివరకు 827 మందిని భారత్‌కు తరలించినట్లు తెలిపింది.

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు :ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలు మరువలేనివి అని దిండిగాల రాజేందర్ అన్నారు.. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఇల్లందు పట్టణ జగదంబ సెంటర్ లో నీ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఫౌండర్ మెంబర్ దిండిగాల రాజేందర్ సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటి తెలంగాణ ప్రజలను జాగృత పరిచి రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ గారి సేవలు ఎన్నటికీ మరువ లేనివి అని ఆ మహనీయుడికి ఘనంగా నివాళి అర్పిస్తున్నాం అని దిండిగాల రాజేందర్ అన్నారు... ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని దిండిగాల రాజేందర్ అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యమ సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, ఇల్లందు పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వర్ రావు, ఇల్లందు మండలం మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ అజ్మీర్ భవు సింగ్ నాయక్, ఇల్లందు పట్టణ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, మహమ్మద్ అబ్దుల్ జబ్బార్, సోషల్ మీడియా & యువజన విభాగం గిన్నారపు రాజేష్, సాతల హరికృష్ణ, కాసాని హరి ప్రసాద్ యాదవ్, సన రాజేష్, ఇల్లందు పట్టణ యువజన నాయకులు ఎస్.కె చాంద్ పాషా, మునిగంటి శివ, తెలంగాణ ఉద్యమ నాయకులు దేరంగుల పోశం, రామ్ లాల్ పాసి, లలిత్ కుమార్ పాసి, ఇల్లందు మండల మాజీ కోఫ్షన్స్ సభ్యులు ఎస్.కె గాజి, కిషన్ పాసి, ఎండి గౌస్, వార రమేష, పరికపెల్లి రవి, దుంపటి కృష్ణయ్య, బజారు సత్యనారాయణ, ఈర్ల శ్రీకాంత్, ఈదుల ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా దోహదం

*** ప్రముఖ యోగా గురువు వెంకటేష్.**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ప్రతీఒక్కరిలోనూ మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా దోహదపడుతుందని ప్రముఖ యోగా గురువులు వెంకటేష్ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూం నగర్ పరిధి, భగత్ సింగ్ మార్గ్ లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల గ్రౌండ్స్ లో పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యోగా డే వేడుకలకు ఆయన హాజరై ఉపాధ్యాయులు, విద్యార్థులచే యోగాసనాలు చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవనశైలి లో వయో తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా (యోగాసనాలు)చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య పంతులుగా ఉంటారని సూచించారు. యాంత్రిక జీవనానికి అలవాటు పడిన ప్రజలు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, అధిక నూనె పదార్థాలను తీసుకుంటున్నారని తద్వారా అనారోగ్యం కోరి తెచ్చుకుంటున్నారన్నారు.ప్రతి ఉదయం గంటపాటు యోగాసనాలు చేయాలని తెలిపారు.ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి, పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ బిరు ఆంజనేయులు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతి మనిషి యోగాసనాలు క్రమం తప్పకుండా చేస్తామని విద్యార్థులు చే వారు ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ బిరు శోభారాణి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, అన్నె ఫాతిమా, ప్రశాంతి, మహేశ్వరి, సాజిదా, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# యోగా సాధన తో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి దేవర్పుల మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనగాం జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి కల్లూరి జితేందర్ రెడ్డి హాజరై కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు యోగ యొక్క ప్రాముఖ్యతను యోగ సాధన ద్వారా మానవ శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుట వల్ల ఎలాంటి వ్యాధులు దరిచేరవు. సర్వరోగ నివారిణి యోగ ఈ ఆధునిక కాలంలో ప్రజలంతా ప్రతిరోజు ఉరుకులు పరుగుల తో తమ జీవితాన్ని గడుపుతున్నారు. అందువల్ల బిపి షుగర్ ఇతర వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.కావున ప్రతి ఒక్కరు రోజు కనీసం 15 నిమిషాలు యోగ సాధన ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఈరోజుల్లో తినే ఆహార పదార్థాలు కలుషితం కావడం వలన వివిధ వ్యాధులు వచ్చే అవకాశాలు కలవు.ఈ వ్యాధులు రాకుండా ఉండాలంటే యోగ ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించవచ్చు. యోగాతో శరీర దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుంది.



యోగ ద్వారా శరీరంలో ప్రతి అవయవానికి ప్రయోజనం కలుగుతుంది.అని కల్లూరు జితేందర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కె భాస్కర్, ఎన్ఎస్ఎస్ పీఓ హైదరాబాద్, ఎన్ఎస్ఎస్ పిఓ అరుణాకర్, అధ్యాపకులు రాధిక, చైతన్య, హరిత, భాను, అనురాధ, రవి, మహేష్, ఉదయ్ భవాని, శ్రీనివాస్, సైదులు, నరేష్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## యోగ సర్వరోగ నివారిణి

* **యోగా గురు ఆర్ ఆర్ ప్రసాద్ గురూజీ**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : యోగ సర్వరోగ నివారిణి అని ఆరోగ్య సంజీవని అని యోగా గురు ఆర్ ఆర్ ప్రసాద్ గురూజీ అన్నారు. అందరికీ ఆరోగ్యం యోగ స్టూడియో ఆధ్వర్యంలో ప్రసాద్ గురూజీ, వారి టీచర్స్ తో పాటు హైదరాబాదులో కెపిహెచ్బి స్టూడియోలో మరియు ఈనాడు ఆఫీసులో వెబినార్లలో జీడిమెట్ల విలేజ్ లిటిల్ లిల్లీ హై స్కూల్ లో కూకట్పల్లిలో సెంటు రీటా హైస్కూల్లో వెయ్యి మందికి పైగా యోగ డే సెలబ్రేషన్స్ జరిగాయి ఈసందర్భంగా వారు ఆసనాలు ధ్యానం మెడిటేషన్ తో పాటు ప్రాణాయామాలు నేర్పించడం జరిగింది. అనంతరం అమృత ఆహారం ఏర్పాటు చేశారు యోగా గురు ఆర్ ఆర్ ప్రసాద్ గురూజీ మాట్లాడుతూ యోగా అనేది జీవితంలో అందరూ ఒక భాగంగా చేసుకోవాలన్నారు. యోగ సాధన ఇటువంటి రోగాన్ని నయం చేయగలిగే శక్తి ఉందని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో యోగ టీచర్ ఈశ్వరి, ఎసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి పాల్గొని వారి యొక్క యోగ అనుభవాలు పంచుకున్నారు ఎసిపి మాట్లాడుతూ యోగా అనేది తనకి ఎంతో ఉపయోగపడుతుందని ఎన్నో రకాల మార్పులు తెచ్చిందన్నారు. వారి యొక్క అనుభవాన్ని పంచుకున్నారు సాయి బాబు హాసిని రిషిక అక్షయ యోగ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్‌కు అమెరికా అండగా నిలిస్తే అందరికీ ముప్పు తప్పదని ఇరాన్ హెచ్చరిక

* **ఇరాన్‌పై సైనిక చర్యకు సిద్ధమవుతున్న అమెరికా**
* **యుద్ధంలో జోక్యంపై రెండు వారాల్లో నిర్ణయిస్తామన్న ట్రంప్**
* **సైనిక జోక్యం గురించి ఆలోచించడం దురదృష్టకరమని వ్యాఖ్య**



ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఘర్షణ వాతా వరణం రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో, ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ పక్షాన చేరితే, అది కేవలం ఇరాన్‌కు మాత్రమే కాకుండా ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ప్రమాదకరంగా పరిణమిస్తుందని ఆయన హెచ్చరించారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్, ఇరాన్‌పై ఇజ్రాయెల్ పరస్పర దాడులతో యుద్ధ వాతావరణం నెలకొంది. ఇరాన్‌పై సైనిక చర్యకు అమెరికా కూడా సిద్ధమవుతున్నట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకుంటారని వైట్ హౌస్ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అబ్బాస్ అరాఘ్చి స్పందించారు. అమెరికా సైనిక జోక్యం గురించి ఆ దేశ అధ్యక్షుడు ఆలోచించడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని నివారించేందుకు దౌత్యపరమైన మార్గాలపై చర్చించేందుకు అరాఘ్చి జెనీవాలో యూరోపియన్ విదేశాంగ మంత్రులతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, త్వరలోనే మరోసారి భేటీ కావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఒకవైపు ఇజ్రాయెల్ దాడులకు అమెరికా రహస్యంగా మద్దతు ఇస్తూ, మరోవైపు అణు ఒప్పంద చర్చలకు తమను ఆహ్వానించడం సరికాదని ఆయన విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాతో అణు చర్చలు జరపడానికి ఇరాన్ సిద్ధంగా లేదని ఆయన స్పష్టం చేశారు.




## సమన్వయంతో ముందుకు సాగుదాం

* **జర్నలిజం విలువలు పెంపొందించేందుకు కృషి చేద్దాం**
* **టీయూడబ్ల్యూజే - ఐజేయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమిది బాల్ రాజు గౌడ్**




మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : నేటి మారిన పరిస్థితులకు అనుగుణంగా జర్నలిజం విలువలను పెంపొందించేందుకు గాను జర్నలిస్టులు సమన్వయంతో ముందుకు సాగాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమిది బాల్ రాజు గౌడ్ అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికల సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డీ.వెంకట్రాం రెడ్డి తో పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సమాజిక మాధ్యమాలు విపరీతంగా పెరిగిన దృష్ట్యా జర్నలిస్టులుగా మన కర్తవ్యాలను నిస్సందేహంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళేలా మన పాత్ర ఉండాలని అన్నాడు. సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా ముందుకు సాగాలని తెలిపారు.జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రాం రెడ్డి మాట్లాడుతూ నేడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జర్నలిస్టులుగా మన వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు దృష్టి సారించాలని అన్నారు. ఈ ఎన్నికలకు సమన్వయ కర్తలు గా వీఎస్ఎన్ రెడ్డి, కల్కూరి ఎల్లయ్యలు వ్యవహరించగా . నూతన కమిటీ అధ్యక్షుడిగా చిర్ర శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వడ్డెమాను సుందర్, కోశాధికారిగా మరాటి మల్లేష్ లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కోశాధికారి ఎన్.రాములు యాదవ్, మేడిపల్లి మండల జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు యోగా చేయడం చాలా మంచిది

* **కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రతి ఒక్కరు యోగా చేయడం చాలా మంచిది అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ఆరోగ్యమే మహాభాగ్యం కార్యక్రమాన్ని గత ఐదు సంవత్సరాలుగా పతాంజలి యోగ వారు నిర్వహించడం జరుగుతుంది. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రిటైర్డ్ జడ్జ్ జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యోగా అనేది మన ఆరోగ్యానికి ఎంతో మంచిది యోగ చాలా రోగాలను నిరోధిస్తుందన్నారు. . ఈ కార్యక్రమంలో కొలన్ లక్ష్మారెడ్డి, మల్లికార్జున్, ఏనుగుల సత్తిరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీలక్ష్మి, యాదయ్య, కోటయ్య, గిరిబాబు, అనిల్ కుమార్, మనీల్, రఘు వంశీ, పతాంజలి యోగ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## యోగాతోనే ఆనందం.. ఆరోగ్యం

* **ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్ కుమార్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రతినిత్యం యోగా చేయడం వల్ల ఆనందంతోపాటు ఆరోగ్యంగా ఉంటామని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్ కుమార్ అన్నారు. చుంచుపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వారి ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగ మాసోత్సవాలలో భాగంగా చివరి రోజైన శనివారం అంతర్జాతీయ యోగడే ఉత్సవాలు కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో ఆయుష్ శాఖ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మహేష్, చుంచుపల్లి మెడికల్ ఆఫీసర్ అండ్ డిప్యూటీ డిస్ట్రిక్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రతిరోజు ఒక అర్ధగంటపాటు యోగ చేయాలని తెలియజేశారు. యోగా వల్ల మనిషి యొక్క వయోపరిమితి పెరుగుతుందని వివరించారు. అనంతరం ఆయుష్ శాఖ ద్వారా నియమితులైన ఆయుష్ యోగ ఇన్‌స్ట్రక్టర్స్ రమేష్ బాబు, కమలా రాణి ల ద్వారా ఈ కార్యక్రమానికి హాజరైన మెడికల్ స్టూడెంట్స్, నర్సింగ్ స్టూడెంట్స్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్స్, సిబ్బంది, మెడికల్ కాలేజ్ సిబ్బందికి యోగ ఆసనాలు వేయించి వాటి యొక్క ఉపయోగాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో, అడిషనల్ డీఎంహెచ్‌వో, వైస్ ప్రిన్సిపల్, డీపీవో, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్, ఆయుష్ శాఖ మెడికల్ ఆఫీసర్స్, ఫార్మసిస్ట్ ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## భారత్‌లో ఏ ఉగ్రదాడి జరిగినా పాక్ మూల్యం చెల్లించుకోక తప్పదు: రాజ్‌నాథ్

భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా భవిష్యత్తులో దేశంలో ఏ ఉగ్రదాడి జరిగినా పాకిస్థాన్ అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జమ్మూకశ్మీర్‌లోని ఉదంపుర్‌లో ఆయన యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. పాక్ ఇలాగే ఉగ్రవాదానికి మద్దతిస్తూ ఉంటే.. అందుకు ఆ దేశం అత్యంత దారుణమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏ చర్య తీసు కోవడానికైనా మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొన్నారు. 2016లోని సర్జి కల్ స్ట్రైక్, 2019లోని వైమానిక దాడులకు కొనసాగింపే ఆపరేషన్ సిందూర్ అని ఆయన పేర్కొన్నారు. తమ 'థౌజండ్ కట్' పాలసీ పనిచేయదని ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు అర్థమైందన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే.

# భారత్-పాక్ యుద్ధంలో మధ్యవర్తిత్వంపై ట్రంప్ వ్యాఖ్యలు..

# స్పందించిన మాజీ ఆర్మీ చీఫ్

* **ట్రంప్ యుద్ధం ఆపారన్న దాంట్లో నిజం లేదన్న జనరల్ మాలిక్**
* **కశ్మీర్ విషయంలో ట్రంప్ మధ్యవర్తిత్వంపై వ్యాఖ్యలు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్య**
* **ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణ పెరిగితే భారత్‌పై తీవ్ర ప్రభావం ఉంటుందని వెల్లడి**
* **జాతీయ ప్రయోజనాలకే భారత్ తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్న వి.పి. మాలిక్**





భారత్, పాకిస్థాన్ మధ్య తాను యుద్ధాన్ని నివారించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనలను మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ వి.పి. మాలిక్ ఖండించారు. అమెరికా ఒక ప్రపంచ శక్తి అని, ప్రపంచవ్యాప్తంగా తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి ప్రతీ సంఘర్షణను నిశితంగా పరిశీలిస్తుందని ఆయన అన్నారు. 1998లో భారత్, పాక్ అణుశక్తి దేశాలుగా మారినప్పటి నుంచి దక్షిణ ఆసియాలోని పరిస్థితులను అమెరికా మరింత నిశితంగా గమనిస్తోందని తెలిపారు. కార్గిల్ యుద్ధ సమయంలో, ఆపరేషన్ పరాక్రమ్, ముంబై 26/11 దాడుల సమయంలో కూడా యుద్ధాన్ని ఆపడానికి లేదా నివారించడానికి అమెరికా ఇరు దేశాలతో దౌత్యపరమైన చర్చలు జరిపిందని జనరల్ మాలిక్ గుర్తు చేశారు. కార్గిల్ యుద్ధం అప్పుడు పాకిస్థాన్ ప్రధాని వాషింగ్టన్ వెళ్లినప్పుడు, అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ నియంత్రణ రేఖకు ఇవతల ఉన్న పాక్ సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తెచ్చారని, పాకిస్థాన్ దానికి అంగీకరించిందని ఆయన వివరించారు. అయితే, ప్రతీసారి భారత్ తన రాజకీయ లక్ష్యాలను అనుసరించిందని, లక్ష్యం నెరవేరిన తర్వాతే పాకిస్థాన్ ప్రత్యక్ష కాల్పుల విరమణ అభ్యర్థనను అంగీకరించిందని స్పష్టం చేశారు. 1971 నుంచి భారత్ ఎప్పుడూ బయటి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదని, ట్రంప్ వ్యాఖ్యలు అవాస్తవమని జనరల్ మాలిక్ తెలిపారు. ఈ విషయాన్ని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఇప్పటికే స్పష్టం చేశారని, ఆయన ప్రకటననే తాను నమ్ముతానని అన్నారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌తో ట్రంప్ భేటీ కావడంపై స్పందిస్తూ, ఇరాన్‌ఇజ్రాయెల్ వివాదంలో అమెరికా ప్రయోజనాలు, ఇరాన్, చైనాలతో వ్యవహరించడంలో పాకిస్థాన్‌ను తమవైపు ఉంచుకోవాలనే ఉద్దేశం, ట్రంప్ వ్యక్తిగత ప్రయోజనాలు దీని వెనుక ఉండవచ్చని జనరల్ మాలిక్ అభిప్రాయపడ్డారు. ఈ భేటీ భారత్‌అమెరికా మధ్య భద్రతా సంబంధిత అంశాలపై విశ్వాస లోపాన్ని పెంచిందన్నారు. పాకిస్థాన్ ప్రస్తుత రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, బలూచిస్థాన్, కేపీకే, ఇప్పుడు ఆపరేషన్ సింధూర్‌తో పాక్ ఆర్మీ నాయకత్వం ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో అక్కడ సైనిక తిరుగుబాటును తోసిపుచ్చలేమని ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రమాదకరమని, అమెరికా జోక్యం చేసుకుంటే పరిస్థితి మరింత తీవ్రమవుతుందని జనరల్ మాలిక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘర్షణ సుదీర్ఘకాలం కొనసాగితే పశ్చిమాసియాలోని ప్రవాస భారతీయులపై, మన ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా ఇంధన అవసరాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ జాతీయ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, దౌత్యపరంగా ఎవరి పక్షం వహించకుండా పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేయాలని సూచించారు. ఏ సంక్షోభంలోనైనా సవాళ్లతో పాటు అవకాశాలు కూడా ఉంటాయని, జాతీయ భద్రత, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మధ్యవర్తిత్వం వహించడానికి వెనుకాడాల్సిన అవసరం లేదని జనరల్ మాలిక్ పేర్కొన్నారు.

# గత ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థ భ్రష్టుపట్టింది: మంత్రి పొంగులేటి

* బీఆర్ఎస్ హయాంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్న మంత్రి పొంగులేటి
* రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
* మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 10,725 రెవెన్యూ సదస్సులు
* మొత్తంగా 8.58 లక్షల దరఖాస్తులు స్వీకరణ
* ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 67 వేల వినతులు
* దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిందని, దానిని ప్రక్షాళన చేసి పారదర్శకమైన పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో శనివారం ఆయన హైదరాబాద్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ



సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ 14న 'భూ భారతి' చట్టాన్ని ఆవిష్కరించారని, ఈ చట్టాన్ని దశలవారీగా అమల్లోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మూడు విడతల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. మొదటి విడత ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టగా, రెండో విడతలో మే 5 నుంచి 28 వరకు 28 మండలాల్లో, మూడో విడతలో జూన్ 3 నుంచి 20 వరకు మిగిలిన ప్రాంతాల్లో సదస్సులు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులను నిర్వహించామని, వీటి ద్వారా ప్రజల నుంచి 8.58 లక్షల దరఖాస్తులు అందాయని మంత్రి వెల్లడించారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67 వేల దరఖాస్తులు రాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 61 వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48 వేలు, నల్గొండ జిల్లాలో 42 వేల దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు ఒకరోజు ముందే ఆయా గ్రామాల్లో రైతులకు, ప్రజలకు ఉచితంగా దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. ఎమ్మార్వోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వెళ్లి ఎలాంటి రుసుము తీసుకోకుండా దరఖాస్తులు స్వీకరించారని వివరించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రశీదు కూడా అందజేశామన్నారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తుల్లో 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, మిగిలిన వాటిని కూడా వీలైనంత త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

## తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల.. 96.38 శాతం ఉత్తీర్ణత

* తెలంగాణ ఎడ్‌సెట్-2025 ఫలితాలు విడుదల
* మొత్తం 96.38 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత
* హైదరాబాద్‌కు చెందిన గణపతిశాస్త్రికి 126 మార్కులతో ప్రథమ ర్యాంక్
* 121 మార్కులతో శరత్‌చంద్ర (హైదరాబాద్)కు రెండో ర్యాంక్



తెలంగాణ రాష్ట్రంలోని బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎడ్‌సెట్ 2025 ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ పరీక్షకు హాజరైన అభ్యర్థుల్లో 96.38 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ ఏడాది ఎడ్‌సెట్ పరీక్షకు మొత్తం 32,106 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 30,944 మంది అర్హత సాధించారు. దీంతో మొత్తం ఉత్తీర్ణత శాతం 96.38గా నమోదైందని అధికారులు పేర్కొన్నారు. పరీక్షలో టాపర్ల వివరాలను పరిశీలిస్తే, హైదరాబాద్‌కు చెందిన గణపతిశాస్త్రి 126 మార్కులతో ప్రథమ ర్యాంకును సొంతం చేసుకున్నారు. హైదరాబాద్‌కే చెందిన శరత్‌చంద్ర 121 మార్కులతో ద్వితీయ ర్యాంకు సాధించగా, వరంగల్‌కు చెందిన నాగరాజు తృతీయ ర్యాంకును దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## రేషన్ కార్డు కోసం లంచం
## ఏసీబీ వలలో తహశీల్దార్ ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్!

* కొత్త రేషన్ కార్డు కోసం లంచం డిమాండ్
* బూర్గంపహాడ్ తహశీల్దార్ కార్యాలయంలో ఘటన
* రూ.2,500 తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కంప్యూటర్ ఆపరేటర్
* డిజిటల్ పద్ధతిలోనూ లంచాలు స్వీకరిస్తున్నట్లు ఆరోపణలు
* లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ విజ్ఞప్తి
* ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడి

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని నిరోధించేందుకు అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా, కొందరు ఉద్యోగుల తీరు మాత్రం



మారడం లేదు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక ప్రభుత్వ ఉద్యోగి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే, బూర్గంపహాడ్ మండల తహశీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న చిట్టెంశెట్టి నవక్రాంత్, ఒక వ్యక్తి బంధువుకు సంబంధించిన రేషన్ కార్డు దరఖాస్తును ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, కొత్త కార్డు జారీ కోసం ఉన్నతాధికారులకు పంపించేందుకు సహాయం చేస్తానని నమ్మబలికాడు. ఈ పని చేసిపెట్టడానికి రూ.2,500 లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఈ విషయాన్ని తెలంగాణ ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాడు. వారి సూచన మేరకు, శనివారం నవక్రాంత్‌కు రూ. 2,500 ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడు నవక్రాంత్ తరచూ రేషన్ కార్డు దరఖాస్తుదారుల నుంచి డిజిటల్ చెల్లింపుల రూపంలో కూడా లంచాలు స్వీకరిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే, తక్షణమే తెలంగాణ అవినీతి నిరోధక శాఖ వారి టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే, వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (@TelanganaACB), అధికారిక వెబ్‌సైట్ (acb.telangana.gov.in) ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ అధికారులు హామీ ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## కౌశిక్ అరెస్ట్ పై హరీశ్ స్పందన... కేటీఆర్ ను కూడా ఇబ్బంది పెడుతున్నారంటూ మండిపాటు

* హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్
* ఇది కక్ష సాధింపు చర్యేనన్న మాజీ మంత్రి హరీష్‌రావు
* రేవంత్ సర్కార్‌పై హరీష్‌రావు తీవ్ర విమర్శలు



గ్రానైట్ క్వారీ వ్యాపారిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న సుబేదారి పోలీసులు, అనంతరం వరంగల్‌కు తరలించారు. ఈ అరెస్టుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. కౌశిక్‌రెడ్డిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే దొంగ కేసు బనాయించి, ఉద్దేశపూర్వకంగా అరెస్టు చేశారని ఆయన మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లా జిన్నారంలో పటాన్‌చెరు నియోజకవర్గ రైతులకు రైతు భరోసా వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో హరీశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కేడీలు, బేడీల రాజ్యం నడుస్తోందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేసీఆర్ అంటే భయం పట్టుకుందని, నిద్రలో కూడా ఆయన పేరే కలవరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఫార్ములా వన్ రేసును రాష్ట్రానికి తీసుకొచ్చిన కేటీఆర్‌ను కూడా ప్రస్తుత ప్రభుత్వం సతాయిస్తోందని మండిపడ్డారు. శని, ఆదివారాల్లో అరెస్టులు చేయవద్దని హైకోర్టు పలుమార్లు చెప్పినా, కౌశిక్‌రెడ్డి విషయంలో పోలీసులు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ప్రస్తుత ప్రభుత్వం సీఎం కుర్చీ విలువను కూడా తీస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహాన్ని జేసీబీలతో పెకలించేయాలి

: తీన్మార్ మల్లన్న

* కేబీఆర్ పార్క్ పేరు మార్చాలంటూ తీన్మార్ మల్లన్న డిమాండ్
* కాసు బ్రహ్మానందరెడ్డి స్థానంలో ప్రొఫెసర్ జయశంకర్ పేరు సూచన
* ప్రభుత్వం స్పందించకుంటే తామే రంగంలోకి దిగుతామని హెచ్చరిక
* బీసీ ప్రభుత్వం వస్తే కేబీఆర్ విగ్రహం కూల్చివేస్తామన్న మల్లన్న
* హైదరాబాద్‌లోని పార్కులు, ఆసుపత్రులు, ప్రాంతాల పేర్లు మార్చాలని డిమాండ్

తెలంగాణ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మరో మారు సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో కెక్కారు. హైదరాబాద్ నగరంలోని ప్రముఖ కేబీఆర్ పార్క్ పేరును తక్షణమే మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కేబీఆర్ పార్క్ వద్ద కొందరు బీసీ నాయకులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ, ప్రస్తుతమున్న కాసు బ్రహ్మానందరెడ్డి పేరును తొలగించి, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కేబీఆర్ పార్క్ పేరును వెంటనే తొలగించి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలి. ఒకవేళ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టకపోతే, ఆ పని మేమే పూర్తి చేస్తాం" అని స్పష్టం చేశారు. అంతేకాకుండా, కేబీఆర్ పార్క్ ముందు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. భవిష్యత్తులో బీసీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహాన్ని జేసీబీల సాయంతో పెకలించివేసి,



ఆ స్థానంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. కేవలం కేబీఆర్ పార్క్ మాత్రమే కాకుండా, హైదరాబాద్ నగరంలోని అన్ని పార్కులకు తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారి పేర్లను పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతోపాటు, నగరంలోని ఆసుపత్రులు, హోటళ్లు, వివిధ ప్రాంతాల పేర్లను కూడా తెలంగాణ మహనీయుల పేర్లతో మార్చాలని తీన్మార్ మల్లన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## జీహెచ్ఎంసీలో 27 మంది అధికారుల బదిలీలు

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో కమిషనర్ ఆర్వీ కర్ణన్ భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడం, కొందరు అధికారులు ఏసీబీకి చిక్కడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 27 మంది అధికారులను బదిలీ చేస్తూ ఈరోజు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల్లో భాగంగా 13 మంది అసిస్టెంట్ సిటీ ప్లానర్లు (ఏసీపీ), 14 మంది సెక్షన్ ఆఫీసర్లను (ఎస్ఓ) బదిలీ చేశారు. కొన్ని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు, పనితీరు ఆధారంగా కొందరికి పదోన్నతులు కూడా కల్పించారు. మెహిదీపట్నం ఏసీపీగా ఉన్న కృష్ణమూర్తిని ఉప్పల్‌కు, కార్వాన్ ఏసీపీ పావనిని సికింద్రాబాద్‌కు బదిలీ చేశారు. చాంద్రాయణగుట్ట సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న సుధాకర్‌కు ఏసీపీగా పదోన్నతి కల్పించి అక్కడే నియమించారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై ప్రజావాణిలో అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ బదిలీలతో పారదర్శకత పెరిగి, ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అధికారులు భావిస్తున్నారు. కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్వయంగా బదిలీ ఉత్తర్వులను అధికారులకు అందజేశారు.

## గిరిజన మహిళపై దాడి.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్

* బూర్గంపాడులో గిరిజన మహిళపై దాడిని ఖండించిన కేటీఆర్
* ఇది ముఖ్యమంత్రి పాలన తీరుకు నిదర్శనమని విమర్శ
* ఇలాంటి సీఎం ఉంటే రాజ్యాంగం ఎలా అమలవుతుందని ప్రశ్న
* దేశ మహిళలకు ఇదేనా కాంగ్రెస్ ఇచ్చే గౌరవమని నిలదీత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని బూర్గంపాడు మండలంలో గిరిజన మహిళపై జరిగిన దాడి అత్యంత అమానుషమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.



ఈ దురదృష్టకర సంఘటన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనా విధానానికి, పరిపాలన తీరుకు అద్దం పడుతోందని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై స్పందించిన కేటీఆర్, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ఇటువంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా కొనసాగితే రాష్ట్రంలో రాజ్యాంగం, చట్టబద్ధమైన పాలన ఎలా అమలవుతుంది?" అని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళల భద్రత, గిరిజనుల హక్కుల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం పైనా కేటీఆర్ విమర్శలు సంధించారు. "రాహుల్ గాంధీ దేశ ప్రజలకు ఇస్తున్న హామీ ఇదేనా? ప్రియాంక గాంధీ దేశంలోని మహిళలకు ఇలాంటి గౌరవాన్నే కోరుకుంటున్నారా? కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రస్తావించే సమానత్వం అంటే ఇదేనా?" అంటూ ఆయన వరుస ప్రశ్నలు వేశారు. బూర్గంపాడు ఘటన కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని బయటపెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# దేశవ్యాప్తంగా యోగా వేడుకలు.. పాల్గొన్న ప్రముఖులు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యావత్ భారతావని వేడుకగా నిర్వహించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రముఖులు పాల్గొన్నారు. ప్రజలతో కలిసి





























# నా బాడీ నా ఇష్టం శృతిహాసన్



టాకీస్: కమల్ హాసన్ గారాల పట్టి శృతి హాసన్ ఎంత స్ట్రైట్ ఫార్వార్డ్ అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనకు సంబంధించిన ఏ విషయం అయిన నిర్మొహమాటంగా చెప్పేస్తుంది. మల్టీ టాలెంటెడ్ అయిన శృతి హాసన్ టీనేజ్‌లో ఉన్నప్పుడే సింగర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టింది. ఆ తర్వాత స్వయంగా ఎన్నో ఆల్బమ్‌లను కూడా రూపొందించింది. ఈ క్రమంలోనే 'హే రామ్' అనే చిత్రంలో చిన్న పాత్రతో నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ లక్ అనే హిందీ చిత్రంలో నిపించింది. ఇక, తెలుగులో వచ్చిన 'అనగనగా ఓ ధీరుడు'తో శృతి హీరోయిన్‌గా జర్నీని స్టార్ట్ చేసింది. అయితే పవన్ కళ్యాణ్ సరసన నటించిన గబ్బర్ సింగ్ చిత్రం శృతి హాసన్ ఫేట్‌ని మార్చేసింది అని చెప్పాలి. కుర్ర హీరోలతోనే కాకుండా సీనియర్ హీరోలతో కూడా శృతి హాసన్ సినిమాలు చేస్తుంది. ఆ మధ్య ప్రభాస్‌తో 'సలార్', బాలకృష్ణతో 'వీరసింహారెడ్డి', చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' మూవీలతో హ్యాట్రిక్ హిట్లు కొట్టింది. త్వరలో సలార్2తో సందడి చేయనుంది. అయితే కెరీర్ పరంగా శృతికి పెద్ద సమస్యలేమి లేవు కాని పర్సనల్ లైఫ్‌లోనే డిస్టబెన్స్ ఎక్కువ అవుతుంది. అప్పట్లో విదేశీ గాయకుడు మైకేల్ కోర్సలేతో డేటింగ్ చేసిన ఈ అమ్మడు అతడిని కమల్ హాసన్‌కు పరిచయం కూడా చేసింది. దాంతో శృతి హాసన్, మైకేల్ కోర్సలే పెళ్లి చేసుకుంటారని అంతా అనుకోగా, కొద్ది రోజులకే వీళ్లు బ్రేకప్ చెప్పుకున్నారు.మైకేల్‌తో విడిపోయిన తర్వాత శృతి హాసన్.. డూడుల్ ఆర్టిస్టు అయిన శాంతను హజారికాతో ప్రేమాయణం కొనసాగించింది. అతడితో ఎంజాయ్ చేసిన ఫొటోలు అన్ని కూడా సోషల్ మీడియాలో షేర్ చేసేది. అతడితో రొమాంటిక్‌గా గడిపింది. కాని ఎందుకో ఏమో శాంతనుకు శృతి హాసన్ బ్రేకప్ చెప్పేసింది. అయితే తాజాగా శృతి హాసన్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. టీనేజ్ లో ఉన్నప్పుడు నా ముక్కు నాకు నచ్చకపోవడంతో 'సర్జరీ' చేయించుకున్నాను అని తెలిపింది. ఇక ముఖం మరింత అందంగా కనిపించేందుకు పిల్లర్స్ కూడా వాడాను. కొంత మంది వీటిని బయటకి చెప్పుకోవడానికి ఇష్టపడరు. కానీ నేను అలా కాదు నా నాబాడీ నా ఇష్టమన్నారు శృతిహాసన్.

# నిహారికకు ఇష్టం లేకుండా పెళ్లి చేశాం.. : నాగబాబు

టాకీస్: మెగా బ్రదర్ నాగబాబు ప్రస్తుతం ఒక పక్క రాజకీయాలతో బిజీగా ఉన్నా కూడా అప్పుడప్పుడు పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా మారాడు. ఇక చాలా రేర్ గా యూట్యూబ్స్ కి ఇంటర్వ్యూలు ఇచ్చే నాగబాబు తాజాగా ఒక యూట్యూబ్ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పిల్లల గురించి మాట్లాడాడు. నాగబాబుకు కొడుకు వరుణ్ తేజ్, కూతురు నిహారిక ఉన్నారు. ముకుంద సినిమాతో వరుణ్ హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. మంచి వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ వరుణ్ తనకంటూ అభిమానులను సంపాదించుకున్నాడు. ఏడాది క్రితం హీరోయిన్ లావణ్య త్రిపాఠిని వివాహం చేసుకున్న వరుణ్ కొన్నేళ్లుగా మంచి హిట్ కోసం





ఎదురుచూస్తున్నాడు. ప్రస్తుతం వరుణ్ ఒక కొరియన్ హర్రర్ కథ నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్నాడు. నిహారిక కొణిదెల.. మెగా కాంపౌండ్ నుంచి ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఏకైక వారసురాలు. ఒక మనసు సినిమాతో ఆమె టాలీవుడ్ కు పరిచయమైంది. అయితే మొదటి సినిమాతోనే విమర్శలు అందుకున్న నిహారికఆ తరువాత పలు సినిమాల్లో నటించినా కూడా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. అయితే ట్రోలింగ్ గురవుతుంది అనుకున్నారో.. లేక విజయం అందుకోదేమో అనుకున్నారో తెలియదు కానీ, మెగా ఫ్యామిలీ నిహారికకు పెళ్లి చేసేసింది. చిరంజీవి ఫ్రెండ్ కొడుకు అయిన జొన్నలగడ్డ చైతన్యతో నిహారిక వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. నిహారిక - చైతన్య కలకాలం కలిసి ఉంటారు అనుకున్న మెగా ఫ్యాన్స్ కు నిరాశ ఎదురయ్యింది. ఆ జంట విభేదాల వలన విడాకులు తీసుకొని విడిపోయారు. దీంతో నిహారిక మరోసారి ట్రోలింగ్ కు గురైంది. కావాలనే నిహారిక అత్తవారింటిని వదిలేసి వచ్చిందని, పబ్ వివాదం ఆ జంటను వేరు చేసిందని రకరకాలుగా వార్తలు పుట్టుకొచ్చాయి. ఇలాంటివేమీ పట్టించుకోని నిహారిక ప్రస్తుతం నిర్మాతగా మారి మొదటి సినిమాతోనే గద్దర్ అవార్డును సొంతం చేసుకుంది.

తాజాగా నాగబాబు తన కూతురు నిహారిక పెళ్లి గురించి మాట్లాడుతూ ..' నిహారిక పెళ్లి విషయంలో మేము పొరపాటు చేసాం. మేము వారిని ప్రోపర్ గా జడ్జ్ చేయలేకపోయాము. వారికి సింక్ అవ్వలేదు. మ్యూచువల్ గా ఇద్దరు విడిపోయారు. ప్రస్తుతం తను ప్రొడక్షన్ హౌస్ స్థాపించి ఇప్పుడిప్పుడే తేరుకుంటుంది. ఏదో ఒకరోజు తను వేరొక అబ్బాయిని కలుస్తుంది. పెళ్లి చేసుకుంటుంది. అంతే. ఈసారి మాత్రమే కాదు నేనెప్పుడూ కూడా పిల్లల విషయాల్లో ఇన్వాల్వ్ అవ్వాలనుకోలేదు.నిహారిక పెళ్లి.. అబ్బాయిని చూపించింది మేమే తప్పు.. ఆమె మద్దతుతో మేము చేయలేదు. మేము చెప్పాము.. ఓకే అన్నట్లు అంతే. ఇష్టంతోనే పెళ్లి చేసుకుంది కానీ, అది తన స్వంత ఇష్టం కాదు. ఇప్పుడు ఒక అబ్బాయి అమ్మాయి కలిసి పెళ్లి చేసుకున్నారు.. వారు జీవితాంతం కలిసి ఉండాలా వద్దా అనేది వాళ్ల జడ్జిమెంట్. వాళ్లు వద్దనుకున్నారు.. విడిపోయారు. నేనెప్పుడూ వారి మధ్య సిమెంట్ వెయ్యడం కానీ, నిప్పు అంటించడం కానీ చేయలేదు. చేయను కూడా. నిహారికకు అడిగాను. ఆమె విడిపోతాను అంది. ఓకే అని చెప్పాను. మర్యాదపూర్వకంగానే విడిపోయారు. ఇప్పుడు తను తన జీవితాన్ని సంతోషంగా గడుపుతుంది' అని చెప్పుకొచ్చాడు.

# వరుస సినిమాలతో ప్రియాంక మోహన్ బిజీ



టాకీస్: ప్రియాంక మోహన్.. స్టార్ హీరోలతో వరుసగా సినిమాలు చేస్తోంది ఈ అమ్మడు. పేరుకు మలయాళ నటినే అయినా పక్కింటమ్మాయిలా కనిపిస్తూ తెలుగు ఆడియెన్స్ కు బాగా చేరవవుతోంది. తన అందం, అభినయంతో టాలీవుడ్ లో క్రమంగా స్టార్ హీరోయిన్ గా ఎదుగుతోంది. కెరీర్ ప్రారంభంలోనే నాని, శర్వానంద్ లాంటి ప్రామిసింగ్ హీరోలతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది. ఈ అందాల తార ఇప్పుడు ఏకంగా పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ కొట్టేసింది. స్టైలిష్ డైరెక్టర్ సుజిత్ తెరకెక్కిస్తోన్నతెరకెక్కిస్తోన్న ఓజీలో ఈ బ్యూటీనే మెయిన్ హీరోయిన్ గా ఎంపికైంది ప్రియాంక మోహన్. చివరిగా సరిపోదా శనివారంతో బ్లాక్ బస్టర్ మూవీని ఖాతాలో వేసుకుంది ప్రియాంక అరుళ్ మోహన్. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉండే ఆమె రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. మొన్నటివరకు గ్లామర్ డోస్ కు దూరంగా ఉండే ఈ అమ్మడు ఇప్పుడు తన బ్యూటీ ఫుల్ ఫొటోలతో అభిమానులను మెప్పిస్తుంది. 2019లో కన్నడ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ప్రియాంక మోహన్. అదే సంవత్సరం న్యాచురల్ స్టార్ నాని 'గ్యాంగ్ లీడర్' సినిమాతో తెలుగు సినిమాకు పరిచయమైంది అందాల తార. ఆతర్వాత శర్వానంద్ తో శ్రీకారం సినిమాలో నటించింది. ఆతర్వాత టాలీవుడ్ లో గ్యాప్ ఇచ్చింది. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు అభిమానులను కవ్విస్తున్నాయి. చీరకట్టులో అందాలు ఒలకబోస్తూ క్రేజీ ఫోటోలను పంచుకుంది. ఈ ఫోటోల పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. అమ్మడి అందాలను పొగుడుతూ కామెంట్స్ చేస్తున్నారు.

# నిర్మాతగా రామ్ పోతినేని!

టాకీస్: హీరోలు నిర్మాతలు అయినంత తేలికగా నిర్మాతలు హీరోలు కాలేరు. కానీ అప్పుడప్పుడు టెక్నీషియన్స్ కూడా హీరోలుగా తమ అదృష్టం పరీక్షించుకుంటూ ఉంటారు. నిజానికి దర్శకులు చాలామంది తమకు నచ్చిన కథను నిర్మాతగా మారితేనే చేయగలమనే నమ్మకంతో ప్రొడ్యూసర్స్ అవుతుంటారు. హీరోలు కూడా తమకు నచ్చిన దర్శకుడిని, నచ్చిన కథను తెర మీద చూసుకోవడానికి నిర్మాతలుగా మారుతుంటారు. అయితే కొందరు కేవలం తామే హీరోలుగా నటించడం కాకుండా కథానుగుణంగా యంగ్ టాలెంట్ నూ ప్రోత్సహిస్తూ ఉంటారు. నాని అలా 'అ', 'హిట్' చిత్రాలను నిర్మించాడు. 'హిట్ -3'లో తానే హీరోగా చేశాడు. విజయ్ దేవరకొండ కూడా తనతో 'పెళ్ళిచూపులు' సినిమా తెరకెక్కించిన దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా 'మీకు మాత్రమే చెబుతా' మూవీని తీశాడు. తాజాగా యంగ్ హీరో ఉస్తాద్ రామ్ పోతినేని సైతం నిర్మాతగా మారబోతున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం రామ్ కు గడ్డు కాలం నడుస్తోంది. అతని చిత్రాలన్నీ బాక్సాఫీస్



బరిలో వరుసగా ఫెయిల్ అవుతున్నాయి. 'స్కంద, డబుల్ ఇస్మార్ట్' పరాజయాల నుండి కాస్తంత కోలుకున్న రామ్ ఇప్పుడు 'ఆంధ్రా కింగ్ తాలుకా' సినిమాలో నటిస్తున్నాడు. ఆంధ్రా కింగ్ గా ఉపేంద్ర నటిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ మహేశ్ బాబు దీనికి దర్శకుడు. ఈ సినిమా కోసం రామ్ గీత రచయితగానూ మారాడు. అలానే త్వరలో నిర్మాత అవుతున్నాడని సమాచారం. విశేషం ఏమంటే... ఇప్పటికే తెలుగు సినిమా రంగంలో రామ్ పెద్దనాన్న రవికిశోర్ 'స్రవంతి మూవీస్' పేరుతో సినిమాలు నిర్మిస్తున్నారు. రామ్ తోనే కాకుండా ఆయన బయటి హీరోలతోనూ సినిమాలు తీస్తున్నారు. అయితే... పెదనాన్న నీడలో కాకుండా తన అభిరుచికి తగ్గట్టుగా సినిమాలు నిర్మించాలని రామ్ భావించాడట. అందుకే ఓన్ బ్యానర్ పెట్టబోతున్నాడని తెలిసింది. తొలి చిత్రం ద్వారా ఓ కొత్త దర్శకుడిని రామ్ పరిచయం బోతున్నాడట. అయితే ఈ సినిమాలో రామ్ నటిస్తాడా? వేరే వాళ్ళతో కేవలం మూవీ మాత్రం నిర్మిస్తాడా అనేది తెలియాల్సి ఉంది. 'ఆంధ్రా కింగ్ తాలుకా' మూవీ విడుదలైన తర్వాత ఓన్ బ్యానర్ కు సంబంధించిన ప్రకటన వస్తుందని తెలుస్తోంది.

# పెళ్లి తర్వాత మెగా కోడలి మొదటి సినిమా



టాకీస్: మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత కొన్ని రోజులు సినిమాలకు బ్రేక్‌నిచ్చిన విషయం తెలిసిందే. 2023లో వరుణ్ తేజ్‌తో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన లావణ్య సుమారు ఏడాదిపాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. అయితే పెళ్లి తర్వాత మెగా కోడలిగా రీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిపింది. లావణ్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం సతీ లీలావతి. భీమిలీ కబడ్డీ జట్టు సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తాతినేని సత్య ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాలపై నాగమోహన్ బాబు.ఎమ్, రాజేష్.టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ ఫస్ట్ లుక్‌లో లావణ్య కోపంతో అరుస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే మూవీ భార్య భర్తలమధ్య ఉన్న అనుబంధం ఆధారంగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. మలయాళ నటుడు దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి మిక్కీ.జె. మేయర్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్‌గా బినేంద్ర మీనన్, ఎడిటింగ్ బాధ్యతలను సతీష్ సూర్య చేపడుతున్నారు. మరోవైపు లావణ్య- వరుణ్ దంపతులు త్వరలోనే తల్లిదండ్రులం కాబోతున్నట్లు ఇటీవల ప్రకటించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.